teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...
తెలుగు దిన పత్రిక

## విధి నిర్వహణలో మానవత్వం చాటిన టీజీఎస్ఆర్టీసీ సిబ్బంది

### ఘనంగా సన్మానించిన యాజమాన్యం



హైదరాబాద్, ఫిబ్రవరి 05 (తీన్మార్ న్యూస్): విధి నిర్వహణలో మానవత్వం చాటిన సిబ్బందిని టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం ఘనంగా సన్మానించింది. హైదరాబాద్ బస్‌భవన్‌లో బుధవారం ఉన్నతాధికారులతో కలిసి మణుగూరు డిపో డ్రైవర్ కోటేశ్వర్‌రావు, గద్వాల్ డిపో కండక్టర్ కిశోర్‌కుమార్, డ్రైవర్ నరేందర్‌గౌడ్, జగిత్యాల డిపో మేనేజర్ సునీతను సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ సతరించారు. ఈ కార్యక్రమంలో

మిగతా 2 లో

ములుగు | సంపుటి : 03 | సంచిక : 271 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | గురువారం | 6 ఫిబ్రవరి 2025 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## తీన్మార్ మల్లన్న వాఖ్యలకు సర్కార్ షోకాజ్ నోటీసులు

పార్టీ ఏమన్నా.. మీ అయ్య జాగీరా.. కాంగ్రెస్ పార్టీ మాది

మరోసారి కాంగ్రెస్ నాయకులపై సంచలన వ్యాఖ్యలు

ఘాటుగా స్పందించిన మల్లన్న



హైదరాబాద్, ఫిబ్రవరి 05 (తీన్మార్ న్యూస్): కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన కులగణన సర్వేపై విమర్శలు చేసిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు కాంగ్రెస్ క్రమశిక్షణా సంఘం షోకాజ్ నోటీసులు జారీ చేయడం పట్ల తీన్మార్ మల్లన్న మండిపడ్డారు. నోటీసుల జారీ వ్యవహారంతో ఆగ్రహానికి గురైన మల్లన్న మరోసారి కాంగ్రెస్ నాయకులపై సంచలన వ్యాఖ్యలు చేశారు. నాకు ఎందుకు నోటీసులు ఇవ్వాలని ప్రశ్నించారు. పార్టీ ఏమన్నా.. మీ అయ్య జాగీరా.. కాంగ్రెస్ పార్టీ మాది..

మిగతా 2 లో

## మాజీ సర్పంచ్‌ల సచివాలయ ముట్టడి ఉద్రిక్తం

పలువురిని అరెస్ట్ చేసిన పోలీసులు







పెండింగ్ బిల్లులు విడుదల చేసేదాకా పోరాటం ఆగదు

13 నెలలుగా పెండింగ్ బిల్లుల కోసం ఉద్యమం

అప్పు చేసి అభివృద్ధి చేస్తే.. ఇచ్చే గౌరవం ఇదేనా..?

ప్రజాపాలన ఇదేనా.. అని ప్రశ్నిస్తున్న మాజీ సర్పంచ్లు

అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం

02



02

## అన్ని రంగాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపణలు



## అండర్ 19 వరల్డ్ కప్ స్టార్‌కు రూ. కోటి నజరానా

గొంగడి త్రిషను అభినందించిన సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 05 (తీన్మార్ న్యూస్): అండర్ 19 వరల్డ్ కప్ స్టార్ గొంగడి త్రిష బుధవారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసింది. ఈ సందర్భంగా ఆమె అద్భుత ప్రదర్శనపై అభినందించిన ఆయన త్రిషకు రూ.కోటి నజరానా ప్రకటించారు. ఇండియా అండర్ 19 వుమెన్స్ టీమ్ వరుసగా రెండోసారి టీ 20 వరల్డ్ కప్ గెలవడంలో త్రిష కీలకపాత్ర పోషించింది. ఆమె తెలంగాణలోని భద్రాచలానికి చెందిన ప్లేయర్

మిగతా 2 లో

## లక్షల మంది వివరాల సేకరణ కాకుండానే కులగణన పూర్తి

రాహుల్ గాంధీ వాఖ్యలపై కేటీఆర్ ఆరోపణలు



తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 05 (తీన్మార్ న్యూస్): లక్షలాది మంది వివరాలను సేకరించకుండానే కులగణన సర్వేను తెలంగాణలో కాంగ్రెస్ సర్కారు పూర్తి చేసిందంటూ రాహుల్ గాంధీ లోక్‌సభలో పేర్కొనడం పార్లమెంట్‌ను తప్పుదోవ పట్టించడమేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఆరోపించారు. ఈ మేరకు రాహుల్ గాంధీకి కేటీఆర్ లేఖ రాస్తూ పార్లమెంట్ వేదికగా చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్ల

మిగతా 2 లో



02

## గ్రామాలలో కుల గణన, వర్గీకరణ సంబరాలు

పార్టీ నేతలకు టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాలు





02

## విడుదలైన టెట్ ఫలితాలు

అర్హత పొందిన 31.21 శాతం మంది అభ్యర్థులు



## మంత్రి సీతక్క ఆధ్వర్యంలో ఎస్టీ ఎమ్మెల్యేల సమావేశం

పార్టీలకు అతీతంగా ఎమ్మెల్యేలు హాజరు

గిరిజన, ఆదివాసీల సంక్షేమంపై సమీక్ష

హైదరాబాద్, ఫిబ్రవరి 05 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ మాసాబ్ ట్యాంక్‌లోని దామోదర సంజీవయ్య సంక్షేమ భవన్‌లో మంత్రి సీతక్క, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్ ఆధ్వర్యంలో ఎస్టీ సామాజికవర్గ ఎమ్మెల్యేలు సమావేశం అయ్యారు. పార్టీలకు అతీతంగా ఎమ్మెల్యేలు హాజరయ్యారు. గిరిజన, ఆదివాసీల సంక్షేమంపై సమీక్షించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడైనా అత్యంత వెనుకబడ్డ జాతులు గిరిజనులే


మిగతా 2 లో

రైతు భరోసాపై

మాజీ మంత్రి హరీష్ రావు

## ప్రశ్నల వర్షం

చేసింది గోరంత, చెప్పకునేది కొండంత



హైదరాబాద్, ఫిబ్రవరి 05 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో ఎకరం లోపు భూమి ఉన్న రైతులకు రైతు భరోసా పథకం కింద బుధవారం రోజు సాయంత్రం నగదు జమ చేశారు. కాగా దీనిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ప్రశ్నల వర్షం

మిగతా 2 లో

## రిజర్వేషన్ల వాటాల్లో మాదిగలకు అన్యాయం

మందకృష్ణ మాదిగ ఆరోపణలు

లోపాలను సరిదిద్ది ముందుకు వెళ్లాలని సూచనలు



హైదరాబాద్, ఫిబ్రవరి 05 (తీన్మార్ న్యూస్): ప్రభుత్వం ప్రతిపాదించిన ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్ల వాటాల్లో మాదిగలకు అన్యాయం జరిగిందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

మిగతా 2 లో

## ఈటెలకు కెసిఆర్ ఫోన్ ప్రచారంపై స్పష్టత

బాధ్యత లేని వ్యక్తుల శాడిజం.. కావాలనే ప్రచారం

.. వివరాలు 2లో



## కాళేశ్వరం కుంభాభిషేక ఆహ్వాన పత్రికను కలెక్టర్ కు అందజేసిన ఈఓ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ఫిబ్రవరి 05 (తీన్మార్ న్యూస్): కాళేశ్వరం దేవస్థాన మహా కుంభాభిషేక మహోత్సవాల ఆహ్వాన పత్రికను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మకు అందచేసిన ఈఓ మహేష్. ప్రముఖ కాళేశ్వరం దేవస్థానంలో ఈ నెల 7, 8, 9 తేదీల్లో జరుగనున్న మహా కుంభాభిషేకం మహోత్సవాలకు ఆహ్వానిస్తూ బుధవారం ఐడిఓసి కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మకు ఆహ్వాన పత్రికను అందచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ శర్మ ఏర్పాట్లు వివరాలను ఈఓ ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహా కుంభాభిషేకం మహోత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశముందని, వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని తెలిపారు. మహా కుంభాభిషేకం మహోత్సవాలు భక్తులకు ఆధ్యాత్మికంగా గొప్ప అనుభూతిని కలిగిస్తాయని, దేవస్థానం ఆధ్వర్యంలో జరిగే ఏర్పాట్లకు పూర్తి సహాయ సహకారాలు అందించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఓఎస్డి పోస్ట్ నుండి మల్లారెడ్డిని తొలగించాలి

### ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మంద నరేష్ డిమాండ్



హనుమకొండ కేయు, ఫిబ్రవరి 05 (తీన్మార్ న్యూస్):లికాకతీయ యూనివర్సిటీ లైబ్రరీ దగ్గర ఏభిఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించన అనంతరం జిల్లా అధ్యక్షులు మంద నరేష్ పాల్గొని మాట్లాడుతూ కాకతీయ యూనివర్సిటీ మాజీ రిజిస్ట్రార్ గా మల్లారెడ్డి బాధ్యతలు చేపట్టినప్పటి నుండి పదవి కాలం పూర్తి అయ్యేవరకు కూడ యూనివర్సిటీలోని ఒక్క విద్యార్థికి కూడ న్యాయం చేసిన రోజు లేదని అన్నారు పీజీ పూర్తి చేసిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రియాంబర్స్ మెంట్ విడుదల చేయకపోవడంతో ప్రభుత్వం విద్యార్థులకు సర్టిఫికెట్స్ అపద్దు అని చెప్పిన కానీ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలను లెక్కచేయకుండా టీసీ మెమోలను విద్యార్థులకు ఇవ్వకుండా తీవ్రంగా ఇబ్బందులకు గురి చేయడం జరిగిందనీ అన్నారు రిజిస్ట్రార్ పోస్ట్ నీ దళిత ప్రొఫెసర్ కి ఇచ్చి ఓఎస్డి పోస్ట్ యూనివర్సిటీలో లేకున్నాకానీ ఓ ఎస్ డి పోస్ట్ నీ క్రియేట్ చేసి హరిబారీగా మల్లారెడ్డికి ఇవ్వడంతో రిజిస్ట్రార్ నీ డమ్మీ చేయడానికే మల్లారెడ్డి కి ఓఎస్డి పోస్ట్ నీ క్రియేట్ చేసి వీసీ ప్రతాప్ రెడ్డి ఇవ్వడం జరిగిందనీ మంద నరేష్ అన్నారు మల్లారెడ్డి కి ఓఎస్డి పోస్ట్ ఇవ్వడముతో యూనివర్సిటీ విద్యార్థి సంఘాలు విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని అన్నారు తక్షణమే వీసీ స్పందించి మల్లారెడ్డి ఓఎస్ డి పోస్ట్ నీ తొలగించాలనీ డిమాండ్ చేశారు. లేనియెడలలో యూనివర్సిటీ పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని మంద నరేష్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీ ఎస్ ఎఫ్ కెయూ అధ్యక్షులు దూడపాక నరేందర్ గణేష్ భరత్ కిరణ్ సాయి వెంకటేష్ సూర్య అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ఆర్బీ, ఎస్ఎస్సీ బ్యాంకింగ్ పరీక్ష కోసం 100 రోజుల ఉచిత శిక్షణ

మహబూబాబాద్ జిల్లా, ఫిబ్రవరి 05 (తీన్మార్ న్యూస్): ఆర్ఆర్బీ, ఎస్ఎస్సీ, బ్యాంకింగ్ రిక్రూట్మెంట్ ఫౌండేషన్ కోర్సు కోసం 100 రోజుల ఉచిత శిక్షణ ఇవ్వనున్న స్టడీ సర్కిల్ డైరెక్టర్ డా. ఎంపివీ ప్రసాద్ నేడు ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల అభ్యర్థులు www.tgbc studycircle. cgg. gov.in ఆన్ లైన్ ద్వారా ఫిబ్రవరి 9వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన సూచించారు. అయితే తల్లిదండ్రుల ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1,50,000, పట్టణ ప్రాంతాల్లో రూ.2,00,000/- మించ కూడదని ఆయన పేర్కొన్నారు. ఎంపిక విధానం ఇంటర్మీడియట్, డిగ్రీ పరీక్షలో పొందిన మార్కుల ఆధారంగా అలాగే రిజర్వేషన్ నియమం ప్రకారం ఉంటుందని స్పష్టం చేశారు. అర్హత గల అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఫిబ్రవరి 12 నుండి 14 వరకు ఉంటుందని, ఫిబ్రవరి 15వ తేదీ నుండి ఉచిత శిక్షణ ప్రారంభం అవుతుందని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు 0870-2571192, 040-24071178 నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

# మహా కుంభాభిషేకం మహోత్సవాలను విజయవంతం చేయాలి





జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ఫిబ్రవరి 05 (తీన్మార్ న్యూస్): మహా కుంభాభిషేకం మహోత్సవాలను టీము వర్కుగా పనిచేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. బుధవారం కాళేశ్వరం దేవస్థానంలో మహా.కుంభాభి షేకం ఏర్పాట్లు పరిశీలించారు. అనంతరం ఈఓ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మహా కుంభాభిషేకం గోడపత్రికలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కాళేశ్వరం దేవస్థానంలో ఫిబ్రవరి 7, 8, 9 తేదీల్లో జరిగే మహా కుంభాభిషేకం కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు. వచ్చే భక్తులు మెచ్చేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. దాదాపు 42 సంవత్సరాలు తరువాత జరుగుతున్న కార్యక్రమమని చాలా ప్రాధాన్యత ఉందని అన్నారు. మన రాష్ట్రంలో జరుగుతున్న మొదటి కార్యక్రమం అని, భవిష్యత్తులో ఇతర దేవాలయాల్లో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడానికి అవకాశం ఉందని విజయవంతం చేసి ఆదర్శంగా నిలవాలని తెలిపారు. ఈ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమిష్టి కృషి చేయాలని సూచించారు. భక్తులు, యంత్రాంగం పరస్పర సహకారంతో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని ఆయన ఆకాంక్షించారు. దేవాలయ ప్రధాన గోపురం ముందు భక్తులకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. భక్తులు కార్యక్రమం వీక్షించేందుకు వీలుగా ఎల్ ఈ డి స్క్రీన్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. భక్తులు రద్దీ నియంత్రణ, క్యూ పాటించడానికి వీలుగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, దేవాలయ శాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణారావు, డిప్యూటీ కమిషనర్ సుమలత, డిపిఓ నారాయణరావు, ఇరిగేషన్ ఈఈ తిరుపతి, పిఆర్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు, డిపిఆర్వో శ్రీనివాస్, కాటారం డిఎస్పీ రామిరెడ్డి, మండల ప్రత్యేక అధికారి వీరభద్రయ్య, తహసిల్దార్ ప్రహ్లాద్ రాథోడ్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, దేవస్థానం ఈఓ మహేష్, ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణ మూర్తి శర్మ తదితరులు పాల్గొన్నారు.

## కులగణ అమలు దేశానికే మార్గదర్శకం చారిత్రాత్మకమైన నిర్ణయం



దేవరకద్ర ప్రతినిధి,ఫిబ్రవరి05(తీన్మార్ న్యూస్) : కులగణ అమలు దేశానికే మార్గదర్శకం, దేశంలోనే ఒక చారిత్రాత్మకమైన నిర్ణయమని రాహుల్ గాంధీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి మరియు దేవరకద్ర ఎమ్మెల్యే జి.ధుసూదన్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసిన మండల కాంగ్రెస్ నాయకులు. వనపర్తి జిల్లా మదనాపురం మండల కేంద్రంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి ఆదేశనుసారం మండలంలో సంబరాలు టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల నాయకులు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ గత 30 సం"ల నుండి పోరాటం చేసిన ఫలితమే ఎస్సీ వర్గీకరణ సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం నేడు క్యాబినెట్లో మరియు అసెంబ్లీలో వర్గీకరణ బిల్లును మూడు గ్రూపులు గా విభజించారని తెలిపారు. 1.గ్రూప్ఏ 1% సంచార జాతులు 2.గ్రూపు బి 9% మాదిగ మాదిగ ఉపకులాలు. 3.గ్రూప్ సి 5% మాల మాల ఉప కులాల బిల్లు ఆమోదం తెలిపినందుకు కృతజ్ఞతలు తెలిపారు.ఆదే విధంగా తెలంగాణలో చేపట్టిన సామాజిక, ఆర్థిక,విద్యా,ఉపాధి,రాజకీయ,కుల గణన (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే 2024) దేశంలోనే ఒక చారిత్రాత్మకమైన నిర్ణయమని అన్నారు.సమాజ అభివృద్ధికి ఈ నివేదిక ఒక దిక్సూచిలా,ఒక మాడల్ డాక్యుమెంట్‌లా మారుతుందని సూచించారు.

సమాజంలో మా లెక్కలు తేల్చాలని ఏడు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న బలహీన వర్గాలు, మైనారిటీల ఆకాంక్షలకు అనుగుణంగా పకడ్బందీ ప్రణాళికతో ఏడాది కాలంలో సర్వేను విజయవంతంగా పూర్తి చేసి,రాష్ట్రంలో అమలు చేయబోయే సంక్షేమ పథకాలకు,అభివృద్ధి కార్యక్రమాలకు,ఉద్యోగ,ఉపాధి, రాజకీయ అవకాశాలకు ఈ నివేదిక ప్రాతిపదికగా పనిచేయాలని,కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అన్నారు. శాసనసభ వేదికగా సభ్యుల హర్షధ్వానాల మధ్య ప్రకటన చేసి,తెలంగాణలో విజయవంతంగా పూర్తి చేసిన 'సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల గణన' (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే 2024) ను ముఖ్యమంత్రి గారి అధ్యక్షతన జరిగిన మంత్రిమండలి ఆమోదముద్ర వేసిందన్నారు.

ముఖ్యమంత్రి సర్వేపై సమగ్రంగా వివరిస్తూ ప్రత్యేకంగా సమావేశమైన శాసనస భ వేదికగా ప్రకటన చేశారన్నారు.రాష్ట్రంలో 46.25 శాతం ఉన్న బీసీలు, మైనారిటీల్లోని బీసీలు కలుపుకుని 56.33 శాతం ఉన్న బీసీలందరికీ సమాజంలో సముచిత మైన గౌరవం, స్థానం కల్పించాలన్న ఆలోచనతో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందనీ అన్నారు.

## ప్రశాంతంగా ఇంటర్ ప్రాక్టికల్ ఎగ్జామినేషన్ పరీక్ష

### ఆకస్మిక అతనికి చేసిన డిఐఈఓ అంజయ్య





ఆత్మకూర్ ఫిబ్రవరి 05 తీన్మార్ న్యూస్: వనపర్తి జిల్లా ఆత్మకూర్ పట్టణ కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ ప్రాక్టికల్ ఎగ్జామినేషన్ పరీక్ష కేంద్రాన్ని వనపర్తి జిల్లా ఇంటర్మీడియట్ విద్య అధికారి అంజయ్య అకస్మికతనికి చేశారు. అనంతరం కళాశాలలోని రికార్డులను ఆయన పరిశీలించారు.అనంతరం ఎం ఎల్ టి కేజీబీవీ విద్యార్థిని అస్వస్థతకు గురి కావడం జరిగింది అట్టి విషయాన్ని తెలుసుకున్న జిల్లా ఇంటర్మీడియట్ అధికారి అంజయ్య ప్రభుత్వ హాస్పిటల్ కి వెళ్లి విద్యార్థిని పరామర్శించి విద్యార్థికి మెరుగైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఇట్టి కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎం భాగ్య వర్ధన్ రెడ్డి సీనియర్ అధ్యాపకులు టి జె విశ్వేశ్వర్ జమ్మన్న సునీల్ కుమార్ పాల్గొన్నారు.

## కేజీవిబి వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



మహబూబాబాద్ జిల్లా, ఫిబ్రవరి 05 (తీన్మార్ న్యూస్): బుధవారం నెల్లికుదురు మండలంలో ఉన్న కస్తూరిబా గాంధీ విద్యాలయం (కేజీవిబీ) వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు, ఆయన వసతి గృహంలోని కిచెన్ షెడ్డు, డైనింగ్ హాల్, క్లాస్ రూమ్, స్టోర్ రూమ్, పరిసరాలను పరిశీలించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన డైట్ మెనూ ప్రకారం పక్కాగా అమలు చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన రుచికరమైన, ఆహారాన్ని అందించాలని సూచించారు. స్వచ్ఛమైన త్రాగునీరు అందిస్తూ ఉండాలని, మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థుల యొక్క మానసిక, ఆరోగ్యం స్థితిగతులను గమనిస్తూ ఉండాలని, షెడ్యూల్ ప్రకారం వైద్య పరీక్షలు, మానసిక వికాస తరగతులను నిర్వహించాలని తెలిపారు. %దీ%వసతి గృహంలోని పరిసరాలలో ప్రతినిత్యం సానిటేషన్ నిర్వహించాలని సూచించారు. %దీ%భోజనం సిద్ధం చేసే సిబ్బంది తగిన జాగ్రత్తలు పాటిస్తూ వంటలు సిద్ధం చేయాలన్నారు. %దీ%మండల ప్రత్యేక అధికారులు వారి సాధారణ పర్యటనలో భాగంగా అన్ని వసతి గృహాలను సందర్శించాలని సూచించారు. విద్యతోపాటు క్రీడలు, మానసిక వికాసంపై మంచి ఫలితాలను సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట కేజీబీవీ ప్రిన్సిపల్ ఇల్లందుల సుమలత, సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠశాల బస్సులు శుభకార్యాలకు వాడకూడదు

**వాడితే కఠిన చర్యలు తప్పవు**

**వాహనదారులు పన్నులు కట్టాలి**

**వాహనం పట్టుబడితే, 200 శాతం**

**అదనపు రుసుము కట్టాలి**

**జిల్లా రవాణాశాఖ అధికారి సంధాని మహమ్మద్**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ఫిబ్రవరి 05 (తీన్మార్ న్యూస్): పాఠశాల యాజ్యమానలకు మీ పాఠశాల బస్సు స్కూల్ పిల్లలకు మాత్రమే తరలించడానికి ఉపయోగించవలెను, మరియు వాహన అన్ని పత్రాలు కలిగి ఉండాలి, స్కూల్ బస్సు నడిపే డ్రైవరు కనీసం ఐదు సంవత్సరాలు హెవీడ్రైవింగ్ లైసెన్స్ పై అనుభవం కలిగి ఉండాలి. లేనియెడల మోటార్ వాహన చట్టా ప్రకారం సీట్ చేయడం జరుగుతుంది. మరియు మిగతా వాహనదారుల అందరికీ విజ్ఞప్తి మీరు మీ వాహన పనులు సకాలంలో చెల్లించాలి, మరియు అన్ని పత్రాలు కలిగి ఉండాలి లేనియెడల కేసు చేస్తే 200 శాతం అదనపు రుసుము చెల్లించాల్సి వస్తుందని జిల్లా రవాణాశాఖ అధికారి సంధాని మహమ్మద్ తెలిపారు.

# ఎస్సీ, బీసీ, ఎస్టీ మైనారిటీ ప్రజలకు రాజకీయ అధికారం బిఎస్పితోనే సాధ్యం

## బహుజన్ సమాజ్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గం ఇంచార్జ్

వనపర్తి, ఫిబ్రవరి 05 (తీన్మార్ న్యూస్): కృష్ణ! కృష్ణ!! అని జపించడం వల్ల డబ్బులు రావొచ్చేమో కానీ, ఎస్సీ బీసీ ఎస్టీ మైనార్టీ ప్రజలకు అధికారం మాత్రం రాదు అని బహుజన్ సమాజ్ పార్టీ దేవరకద్ర అసెంబ్లీ నియోజకవర్గం ఇంచార్జ్ జన్నంపల్లి వినోద్ కుమార్ తెలియజేశారు. బహుజనులు ఈ విషయాన్ని బాగా ఆలోచించాలని ఆయన కోరారు. 2019లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ, వారి 323 మంది ఎంపీల మద్దతుతో 124వ రాజ్యాంగ సవరణ ద్వారా, రాజ్యాంగంలోని ఆర్టికల్ 15, 16లను ఉపయోగించి, దేశంలోని 140 కోట్ల జనాభాలో 3 శాతం కూడా లేని అగ్రవర్ణాలలోని పేదలకు %జుఔ% పేరుతో 10 శాతం రిజర్వేషన్లు కల్పించింది. బీజేపీ తన రాజకీయ బలంతో కేవలం మూడు రోజుల్లోనే ఈ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదింపజేసుకోగలిగింది. కానీ, 30 ఏళ్లు గడుస్తున్నా, ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కానీ, బీసీల సంక్షేమం కానీ ఎందుకు సాధ్యం కాలేదు. దీనికి కారణం ఏమిటో ఆలోచించాలి అని వినోద్ కుమార్ అన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న షెడ్యూల్డ్ కులాల వారికి రాజ్యాంగబద్ధంగా కేటాయించిన 15 శాతం రిజర్వేషన్లను %ఊ, దీ, జ, ణ% గ్రూపులుగా వర్గీకరించాలని మందకృష్ణ మాదిగ నేతృత్వంలో ఎంఆర్పిఎస్ ఎన్నోసార్లు ఢిల్లీకి లక్షల మందితో ప్రదర్శనలు చేసింది. వివిధ రాజకీయ పార్టీల నాయకుల కాళ్ళ వేళ్ళా పడి బతిమిలాడింది. ధర్మయుద్ధ సభ, మాదిగల గర్జన, మాదిగల యుద్ధభేరి, మాదిగల విశ్వరూపం ఇలా రకరకాల పేర్లతో ఉద్యమాలు చేసింది. ఇప్పుడు మళ్ళీ లక్ష దప్పులు వేల గొంతుకల పేరుతో ఫిబ్రవరి 7న మీటింగ్ ఏర్పాటు చేస్తున్నారు అని ఆ మీటింగ్ కు పర్మిషన్ ఇవ్వకుండా మాదిగలను వర్గీకరణ వాదులను అవమానించిందని ఆయన అన్నారు. మందకృష్ణ మాదిగ, ఎమ్మార్పీఎస్ వర్గీకరణ వాదులను అమాయకులను చేసి, వారి ఓట్లతో గద్దెనెక్కిన తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాలు తమ రాజకీయ అధికారంతో ఉభయ సభలలో వర్గీకరణకు అనుకూలంగా బిల్లు పెట్టగలిగాయి. అంబేద్కర్ గారు చెప్పినట్లు, రాజకీయ శక్తి ఎంత శక్తివంతమైనదో ఎస్సీ, బీసీ ప్రజలు ఆలోచించుకోవాలి. దోపిడీకి, అణిచివేతకు గురవుతున్న జాతులపై అత్యాచారాలు, దౌర్జన్యాలు జరగకుండా గౌరవంగా బ్రతకాలంటే, ఎస్సీ, బీసీ జనాభా తమ ఓటుతో రాజకీయ శక్తిగా ఎదగాలని బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారు ఎన్నో శ్రమలకోర్చి ఓటును హక్కుగా ఇచ్చారు. దీనిని ఆయుధంగా వాడి, ప్రజాస్వామ్యబద్ధంగా రాజ్యాంగ ఫలాలను పొందాలని అనగారిన వర్గాలకు ఓటు ను హక్కు గా అందిస్తే, ఓటును పనికిరాని సంక్షేమాలకు అమ్ముకొని, విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాలలో నేటికీ దోపిడీకి గురవుతున్నారు అని వినోద్ కుమార్ అన్నారు. అంబేద్కర్ సిద్ధాంతానికి ఓట్లు, సీట్లు రావని అంబేద్కర్ సిద్ధాంతం చెల్లదంటూ ఆయనను బ్రతికుండగానే ఆయన అనుచరులుగా ఉన్న ఎస్సీ, బీసీ జాతినాయకులు వెన్నుపోటు పొడిచి, ఆయన మరణానికి కారణం అయ్యారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మరణాంతరం, వారి సిద్ధాంతాన్ని తన భుజాలపై వేసుకొని,




దేశంలోని అణగారిన, వెనుకబడిన వర్గాలను కలుపుకొని, అంబేద్కర్, పూలే, సాహూ మహారాజ్, పెరియర్ నాయకర్, నారాయణ గురు లాంటి వ్యక్తుల ఆదర్శంతో సిద్ధాంతాన్ని తయారుచేసి, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు రాజకీయ అధికారాలను పొందవచ్చు అని దేశంలోనే అతిపెద్ద రాష్ట్రం ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో సోదరి కుమారి మాయావతిని ముఖ్యమంత్రిని చేసి, బహుజన అధికారంతో వెనుకబడిన, అణగారిన వర్గాలకు రాజ్యాంగబద్ధంగా న్యాయం చేశారు. దీనిని ఏమాత్రం గుర్తించని ఎమ్మార్పీఎస్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు, అనుచరులు తమ స్వార్థాలకు ఇతర రాజకీయ పార్టీలకు ఎన్నికల ముందు, ఎన్నికల తర్వాత అవసరం ఉన్నప్పుడు తమ జాతులను తాకట్టు పెట్టడమే కాకుండా, రకరకాలుగా రెచ్చగొడుతూ, వర్గీకరణ పేరుతో, సంక్షేమాల పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై యుద్ధం ప్రకటించినట్లు నటించి, దానికోసం జీవించి, లోలోపల ఒప్పందం చేసుకొని, పబ్బం గడుపుకునే పరిస్థితులను తెరలేపుతున్నారన్నది వాస్తవం. కాబట్టి, రాజ్యాంగబద్ధమైన, న్యాయబద్ధమైన ఎస్సీ రిజర్వేషన్లలో వర్గీకరణ గానీ, బీసీల సంక్షేమం అయినా గానీ, దేశంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ప్రజలు పొందాలంటే, తక్షణమే రాజకీయ శక్తిగా ఎదిగి, రాజ్యాంగబద్ధ పదవులను చేజిక్కించుకోగలిగితే, పూలే, అంబేద్కర్, కాన్షీరాం ఆశయాలను నెరవేర్చినవారవుతారు అని ఆయన అన్నారు.

## ఘనంగా కాంగ్రెస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి రాంబాబు జన్మదిన వేడుకలు



ములుగు, ఫిబ్రవరి 05 (తీన్మార్ న్యూస్): బుధవారం జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా అధ్యక్షుడు, స్వర్గీయ నల్లెల్ల కుమారస్వామి వీరాభిమాని, ములుగు పట్టణ ప్రధాన కార్యదర్శి కోగిల రాంబాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రాంబాబు మొదట తన రాజకీయ గురువు స్వర్గీయ నల్లెల్ల కుమారస్వామి చిత్రపటానికి పూలమాలవేసి, నివాళులర్పించి, ఆశీర్వాదం తీసుకొని తదనంతరం జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బాదం ప్రవీణ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు పల్లె జైపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ బండారి హరినాథం, కాంగ్రెస్ పార్టీ ములుగు పట్టణ అధ్యక్షులు చింత నిప్పుల బిక్షపతి, అనంతరం సహచర తెలంగాణ ఉద్యమకారులు అచ్చునూరి కిషన్ ముదిరాజ్, కుక్కల నాగరాజు ముదిరాజ్, భూమ నరేష్ ముదిరాజ్, మేకల రమేష్ ముదిరాజ్, కోగిల మహేష్ ఆధ్వర్యంలో ఘనంగా కోగిల రాంబాబు'కు శాలువా కప్పి జన్మదిన వేడుకలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ నాకు ఈరోజు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన పెద్దలకు, మిత్రులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ట్రాన్స్ జెండర్లకు అన్ని చోట్ల ప్రాధాన్యత కల్పిస్తాం



### సమస్యల పరిష్కారానికి నోడల్ అధికారిగా జిల్లా సంక్షేమ అధికారి

### జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట, ఫిబ్రవరి 05 (తీన్మార్ న్యూస్): ట్రాన్స్ జెండర్లుకు అన్ని చోట్ల ప్రాధాన్యత కల్పిస్తామని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్ నందు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ జిల్లా లోని ట్రాన్స్ జెండర్ ల సమస్యల గురించి అధికారులతో, ట్రాన్స్ జెండర్ లతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ట్రాన్స్ జెండర్ ల సమస్యల పరిష్కారానికి జిల్లా సంక్షేమ అధికారిని నోడల్ ఆఫీసర్ గా నియమించటం జరిగిందని ట్రాన్స్ జెండర్ లు ఎదుర్కొంటున్న సమస్యలను జిల్లా సంక్షేమ అధికారికి తెలియజేయాలని సూచించారు. ట్రాన్స్ జెండర్ లు ఆధార్ కార్డులో మార్పులు చేయుటకు ప్రత్యేక క్యాంప్ లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఈడియంని ఆదేశించారు. ట్రాన్స్ జెండర్లు తమ గుర్తింపు కార్డుల కోసం నేషనల్ పోర్టల్ ఫర్ ట్రాన్స్ జెండర్ పర్సన్స్ అనే పోర్టల్ ద్వారా ఆన్ లైన్ లో ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి పరిశీలన తదుపరి జిల్లా కలెక్టర్ గుర్తింపు కార్డులు జారీ చేయటం జరుగుతుందని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి కే.నరసింహ రావు, లీడ్ బ్యాంకు మేనేజర్ బాపూజీ, సి డి పి ఓ రూప, మిషన్ శక్తి కో ఆర్డినేటర్ చైతన్య,మున్సిపల్ సిబ్బంది మెప్మా అధికారులు, ట్రాన్స్ జెండర్ లీడర్ బానోతు శ్రీలేఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాల నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

### డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ పోస్టర్ ఆవిష్కరించిన సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్



హైదరాబాద్, ఫిబ్రవరి 05 (తీన్మార్ న్యూస్): తెలంగాణ స్టేట్‌హోజెర్నలిస్ట్స్ యూనియన్ (టీఎస్ జేయు) ఆధ్వర్యంలో డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం త్వరలో చేపట్టబోతున్న 2కే రన్ కార్యక్రమ ప్రచార పోస్టర్ ను బుధవారం తెలంగాణ సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ హరీష్ సెక్రటేరియట్ లోని తన ఛాంబర్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్తు పదార్థాల నివారణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ కోసం ప్రజలను చైతన్యవంతం చేసే కార్యక్రమాన్ని చేపట్టిన తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ సభ్యులకు అభినందనలు తెలిపారు. జర్నలిస్టుల సామాజిక బాధ్యతగా సమాజంలోని రుగ్మతలను దూరం చేసేందుకు ప్రయత్నించడం అభినందనీయమన్నారు.

జర్నలిస్టులు జర్నలిస్టు సంఘాలు ఇందు కోసం కృషి చేయాలని కోరారు. ఈ 2కే రన్ లో అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిఎస్ జేయు రాష్ట్ర అధ్యక్షులు పురుషోత్తం నారగౌని, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్, నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్ (ఎన్ యు జె (ఐ) జాతీయ కార్యదర్శి మెరుగు చంద్రమోహన్, రాష్ట్ర నాయకులు లింగబత్తిని కృష్ణ, ముత్యం ముఖేష్ గౌడ్, వెల్తూరి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## కొండపర్తి గ్రామ అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి



### జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్

ములుగు జిల్లా, ఫిబ్రవరి 05 (తీన్మార్ న్యూస్): గవర్నర్ దత్తత తీసుకున్న గిరిజన గ్రామమైన కొండపర్తి అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులను ఆదేశించారు. బుదవారం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, గవర్నర్ జాయింట్ సెక్రెటరీ భవాని శంకర్ ప్రైవేట్ సెక్రటరీ పవన్ సింగ్ లతో కలిసి రాష్ట్ర గవర్నర్ దత్తత తీసుకున్న తాడ్వాయి మండలంలోని కొండపర్తి గ్రామంను సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న స్కిల్ డెవలప్మెంట్ సెంటర్, సోలార్ ఆర్గనైజింగ్ సిస్టం, మసాలా మేకింగ్, టైలరింగ్ సెంటర్, స్కూల్ అంగన్వాడి భవనాల కాంపౌండ్ వాల్, టాయిలెట్స్, వాటర్ సప్లై తదితర అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గ్రామములో 79 బిపిఎల్ గృహాలు ఉన్నాయని, 370 మంది జనాభా జీవ-నోపాధి మెరుగుపర్చుటకు వ్యయసాయం

చేసుకొనుటకు 10 ఎకరాల వ్యవసాయ భూమిలో ఒక బోర్ వేయుటకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేష్, ట్రైబల్ వెల్ఫేర్ ఈ ఈ వీరభద్రం, వ్యవసాయ శాఖ అధికారి సురేష్ కుమార్, తహసిల్దార్, ఎంపీడీవో, సంబంధిత అధికారులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ కాలేజ్ భవన నిర్మాణాన్ని పర్శిలించిన జిల్లా కలెక్టర్



మహబూబాబాద్ జిల్లా, ఫిబ్రవరి 05 (తీన్మార్ న్యూస్): బుధవారం మహబూబాబాద్ పట్టణ పరిధిలో ఉన్న మెడికల్ కాలేజ్ భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన నిర్మాణం జరుగుతున్న బ్లాకులను పరిశీలించారు, షెడ్యూల్ ప్రకారం ఎలాంటి జాప్యం లేకుండా భవన నిర్మాణ పనులను నాణ్యంగా వేగంగా పూర్తి చేయాలని, సంబంధిత ఇంజనీరింగ్ సిబ్బందికి సూచించారు. ప్రస్తుతం నిర్వహించబడుచున్న కాలేజీ వసతి గృహంలో వైద్య విద్యార్థులకు త్రాగునీరు సరఫరా, విద్యుత్ సదుపాయం, తదితర సౌకర్యాలు కల్పిస్తూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపల్ కు సూచించారు. సాధ్యమైనంత త్వరగా భవన నిర్మాణ పనులను పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ లకావత్ వెంకట్, సంబంధిత ఇంజనీరింగ్, మెడికల్ కాలేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు బహుమతులు అందజేత

### ఏబీవీపీ ఖేలో భారత్ క్రీడోత్సవాల్లో భాగంగా






ఆత్మకూర్ ఫిబ్రవరి 05 తీన్మార్ న్యూస్:- వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణ కేంద్రంలో ఏబీవీపీ ఖేలో భారత్ 2025 క్రీడ ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని అన్ని ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు గత రెండు రోజుల నుంచి క్రీడా పోటీ నిర్వహించారు. బుధవారం రోజు స్థానిక ఎంవి రామన్ పాఠశాల ఆవరణంలో క్రీడాకారులకు ఎం.వి రామన్ పాఠశాల అధినేత ఎం.శ్రీధర్ గౌడ్ క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని అన్నారు ఏబీవీపీ చేస్తున్న కార్యక్రమాల గురించి ఆయన కొనియాడారు. ఇట్టి కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా అధ్యక్షులు అర్జున్ ఆత్మకూరు మండల ఏబీవీపీ మండల అధ్యక్షులు మణికంఠ ఏబీవీపీ మండల నాయకులు జగదీష్ అనిల్ నవీన్ పల్లవి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ కులగణన చరిత్రాత్మకం



దేవరకద్ర ప్రతినిధి,ఫిబ్రవరి05(తీన్మార్ న్యూస్) సుధీర్ఘంగా ఎస్సీ వర్గీకరణ గురించి పోరాటం చేస్తున్న మాదిగలకు ఉప కులాలకు ముఖ్యమంత్రి ద్వారా ఎస్సీ వర్గీకరణ చేయడం అసెంబ్లీలో బిల్లు పాస్ కావడం శుభసందర్భంగా దేవరకద్ర నియోజకవర్గం ఎస్సీ వర్గీకరణ మీద తెలంగాణ అసెంబ్లీలో బిల్లు పాస్ చేసిన సందర్భంగా దేవరకద్ర నియోజకవర్గ లో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మారుగళ్ళ సాయిబాబా ఉద్దేశించి మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే జిల్లా అధ్యక్షులు జి.మధుసూదన్ రెడ్డి సహకారంతో అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఏబిసిడి వర్గీకరణకు అనుకూలంగా ఎస్సీలలో మాదిగలకు మాదిగ ఉపకులాలకు మాలలకు మాల ఉప కులాలకు సరైన నిష్పత్తి ప్రకారం ఏబిసి గా రిజర్వేషన్ కల్పించిన పాలమూరు మట్టిబిడ్డ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కి స్థానిక ఎమ్మెల్యే జిఎంఆర్ కి మహబూబ్నగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సామాజిక,ఆర్థిక,విద్య,ఉపాధి,రాజకీయ మరియు కుల న్యాయం జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మారగల సాయిబాబా,ఉపాధ్యక్షులు మొగల్ మరియు ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు రాము,ధనుంజయ్, వెంకట్, రామాంజనేయులు,నరసింహులు,నరహరి,బీసీ సంఘం నాయకులు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# సుప్రీం తీర్పుపైనే బిఆర్ఎస్ ఆశలు!

పార్టీలు మారడం తప్పే...ఒకపార్టీ నుంచి గెలిచిన వారు మరో పార్టీలోకి మారడం అన్నది సర్వసాధారణం అయ్యింది. రాజ్యాంగం ప్రకారం కఠిన నిబంధనలు లేకపోవడంతో జంపింగ్ జిలానీలు ఉండనే ఉంటున్నారు. అధికారంలో ఉన్న పార్టీకి సహజంగానే దుంకేస్తున్నారు. ఇంతకాలంగా ఇది నడుస్తూనే ఉంది. తాజాగా తెలంగాణలో పదిమంది బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ కండువా కప్పుకోవడంతో లొల్లి మొదలయ్యింది. దీనిపై బిఆర్ఎస్ పోరాడుతూనే ఉంది. చివరకు సుప్రీంలో కేసు వేసింది. ఇంతకాలం ఎందుకు చర్య తీసుకో లేదని తాజాగా సుప్రీం ప్రశ్నించడంతో తెలంగాణ అసెంబ్లీ కార్యదర్శి ఆ పదిమందికి నోటీసులు ఇచ్చారు. లిఖిత పూర్వక సమాధానం ఇవ్వాలన్నారు. ఇదంతా ఒక ఎత్తయితే గతంలో ఎమ్మెల్యేను గంపగుత్తగా పార్టీలో చేర్చుకుని కాంగ్రెస్, టిడిపి, సిపిఐలను దెబ్బకొట్టిన చరిత్ర బిఆర్ఎస్ పార్టీది. తెలంగాణ పునరేకీకరణ పేరుతో నిస్సిగ్గుగా ఎమ్మెల్యేలను గోడదాటించారు. ఆనాడు వారి చేసివుండకపోయి వుంటే..ఇవాళ బిఆర్ఎస్ వాదనకు బలం ఉండేది. నిజాయితీ ఉండేది. కానీ తొమ్మిదన్నరేళ్ల పాలనలో చేయని అరాచకం లేదు. తెలంగాణ రావడం ఆ కుటుంబం కోసమే అన్నట్లుగా పాలన సాగించారు. ఇష్టం వచ్చినట్లుగా అప్పులు చేసి, అభివృద్ధి ముసుగేశారు. దాదాపు 7 లక్షల కోట్లు అప్పులుచేసిన పెద్దాయన ఇప్పుడు అసెంబ్లీ మొహం చూడడం లేదు. ఫామ్‌హౌజ్ వీడి బయటకు రావడం లేదు. కేవలం ఆయన కొడుకు, కూతురు, అల్లుడు మాత్రమే రాజకీయాలు నడుపుతున్నారు. అసెంబ్లీలో కూడా అబద్దాలు చెప్పడం అలవాటు చేసుకున్నారు. ఏడాది కాంగ్రెస్ పాలనపై దుమ్మెత్తి పోస్తున్నారు. ఉప ఎన్నికలకు సిద్దంగా ఉండండి అంటూ కెటిఆర్ పార్టీ శ్రేణులకు లీకులు ఇస్తున్నారు. తెలంగాణలో అధికారం కోల్పోయిన బిఆర్ఎస్, తరవాత పార్లమెంట్ ఎన్నికల్లో పూర్తిగా చతికిల పడ్డది. విజయం సాధించక పోవడంతో పలువురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. పదిమంది పోయారనని సరిపెట్టుకోవడానికి కూడా లేదు. గతంలో టిఆర్ఎస్ ఆడిన విధంగానే కాంగ్రెస్ కూడగా పాచికలు వేస్తోంది. బిఆర్ఎస్‌ను బొందపెట్టడమే లక్ష్యంగా కాంగ్రెస్, బిజెపిలు పావులు కదుపుతున్నాయి. ఎందుకంటే ఇప్పటికే అనేకమంది బిఆర్ఎస్‌ను వీడి అధికార కాంగ్రెస్‌లో చేరుతున్నారు. ఎమ్మెల్యేలు జారుకుంటున్నారు. అధికారంలో లేకున్నా ఎపిలో విపక్షంగా టిడిపి ఉన్నా బలంగా నిలబడి తిరిగి అధికారం దక్కించుకుంది. అక్కడ జగన్ ఎన్ని విధాలుగా వేధించినా నేతలు, కార్యకర్తలు టిడిపిని వీడలేదు. కానీ బిఆర్ఎస్‌లో అంతర్గత ప్రజాస్వామ్యం లేదు. ఒక కటుఉంబం చేతిలో పార్టీ ఉండిపోయింది. పదేళ్లు అధికారంలో ఉన్నా కుటుంబ పాలన వల్ల బిఆర్ఎస్ అధికారం కోల్పోయింది. అనేక అక్రమాలను మూటకట్టుకుంది. అవే ఇప్పుడు యమపాశాలై వెన్నాడుతున్నాయి. ఓటమి తరవాత ఇక్కడ బిఆర్ఎస్, ఎపిలో వైసిపి ఒకే తరహా డ్రామాలు ఆడుతున్నాయి. ఎమ్మెల్యేలను లేదా ఎంపిలను లేదా క్షేత్రస్థాయిలో క్యాడర్‌ను చేర్చుకోవడంలో తెలంగాణలో పోటీ కేవలం కాంగ్రెస్, బిజెపిల మధ్యనే ఉంది. ఈ రెండు పార్టీలు ఆధిపత్యం లక్ష్యంగా పెట్టుకుని పోరాడుతున్నాయి. దీంతో విపక్ష బిఆర్ఎస్‌లో చేరేందుకు ఎవరు కూడా ముందుకు రావడం లేదు. పదేళ్లు అధికారంలో ఉన్న పార్టీ ఇంతగా ప్రజల్లో ఆదరణ కోల్పోవడం కేవలం బిఆర్ఎస్‌లో మాత్రమే కనిపిస్తోంది. ఈ క్రమంలో వచ్చే స్థానిక ఎన్నికల్లో బిఆర్ఎస్ అత్యధిక సర్పంచ్ సీట్లు గెలిస్తేనే రాజకీయంగా నిలుస్తుంది. అందుకే మైండ్ గేమ్ ఆడుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్యంగా బీఆర్ఎస్ చతికిల బడటం, కాళేశ్వరం ప్రాజెక్టుపై జరుగు తున్న విచారణ, ఎమ్మెల్సీ కవిత మద్యం కుంభకోణంలో జైలుకు వెళ్లడం, ముఖ్యనేతలు అనుకున్న వారంతా కారు దిగి హస్తం పార్టీలోకో, బీజేపీ గూటికో చేరడం వంటి పరిణామాలతో గులాబీ పార్టీ ఉక్కిరి బిక్కిరి అవుతోంది. దీంతో పార్టీ క్యాడర్లో జోష్ నింపేందుకు కేటిఆర్ నిత్యం ఏదో ఒక విధంగా అబద్దాల ప్రచారం అందుకున్నారు. తమ పదేళ్లలో చేయలేని పనులను ఇప్పుడు ప్రస్తావిస్తున్నారు. తమ దోపిడీ రాజ్యాన్ని ప్రజలు మరచి పోయేందుకు డ్రామాలు ఆడుతున్నారు. ఈ క్రమంలో పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయించేందుకు సుప్రీంలో కేసు వేసి పోరాడుతున్నారు. పార్టీ మారడం నైతికంగా తప్పే. సుప్రీం దీనిని గుర్తించి తీర్పును ఇస్తే వచ్చే తరాలకు ఇది..ఓ గుణపాఠం కానుంది. ఇదంతా రానున్న వారం రోజుల్లో తేలుతుందా అన్నది చూడాలి. ఇకపోతే అసెంబ్లీ సమావేశాలకు ఇక్కడ కెసిఆర్, అక్కడ జగన్ హాజరు కావడం లేదు. ఇలా హాజరుకాని వారిని ఎమ్మెల్యేలగా ఎందుకు పరిగణించాలో కూడా చట్టంలో చెప్పలేదు. అందువల్ల దీనిపైనా చర్చ చేయాల్సి ఉంది. అసెంబ్లీకి ఎందుకురారో చెప్పడం లేదు. కెసిఆర్, జగన్ అసెంబ్లీ సమావేశాల్లో కీలకంగా వ్యవహరిస్తారని అంతా అనుకున్నారు. కానీ అలాంటిదేమీ జరగలేదు. అసెంబ్లీ ద్వారా ప్రజల్లో ఉండేందుకు వచ్చిన అవకాశాన్ని వదులుకున్నారు. త్వరలోనే పెద్ద బహిరంగ సభ పెట్టి కాంగ్రెస్‌ను కడిగి పారేస్తానని అంటున్నారు. అయితే ఇప్పటికిప్పుడు బిఆర్ఎస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. గులాబీ పార్టీని నిలుపుకునేందుకు మాజీ సీఎం ఆ పార్టీ అధినేత కేసీఆర్ రంగంలోకి దిగుతారని అనుకుంటున్నారు. త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వం కూలుతుందని బిజపి, బిఆర్ఎస్‌లు ప్రచారం చేస్తున్నా అది పెద్దగా ప్రజలు పట్టించుకునే స్థాయిలో లేదు. స్థానిక ఎన్నికల తర్వాత బిఆర్ఎస్ పార్టీ ఉనికి కోల్పోతుందని కాంగ్రెస్ జోస్యం చెబుతోంది. బీఆర్ఎస్ దుకాణం బంద్ అవుతుందని, దాదాపు 25 మంది ఎమ్మెల్యేలు కారు దిగడం ఖాయమని ప్రచారం సాగుతోంది. బీఆర్ఎస్ లో నలుగురు మాత్రమే ఉంటారని, మిగతా వారంతా బయటకు రావడం ఖాయమని గులాబీ నేతలను మానసికంగా కృంగదీసేలా మంత్రులు తమ వ్యాఖ్యలు ముమ్మరం చేస్తున్నారు. అయితే స్థానిక ఎన్నికల్లో బలాబలాలు ఎలా ఉంటాయన్నది చూడాలి. అలాగే పార్టీ మారిన ఎమ్మెల్యేలపై సుప్రీం తీర్పు ఎలా ఉంటుందో చూడాలి.

# నెరవేరిన ఉత్తరాంధ్రవాసులు కల

**విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్**

**విశాఖ, విజయవాడ, గుంటూరు, గుంతకల్లు డివిజన్లు**

**కేంద్ర నిర్ణయంపై ఎంపి శ్రీభరత్ హర్షం**




**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 5 (తీన్మార్ న్యూస్):** ఉత్తరాంధ్ర వాసులకు కేంద్రం పండగలాంటి వార్త చెప్పింది. విశాఖపట్నం రైల్వే డివిజన్, విశాఖ కేంద్రంగా సౌత్ కోస్టల్ రైల్వే జోన్ పరిధిలను కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. ఎన్నో ఏళ్ల తరవాత ఇలా ఉత్తరాంధ్ర ప్రజల ఆకాంక్ష నెరవేరింది. విశాఖ రైల్వే అభివృద్ధికి చారిత్రాత్మక ముందడుగు పడింది. కేంద్ర ప్రభుత్వం విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రకటించింది. కూటమి ప్రభుత్వం విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని కేంద్రం తాజా ఉత్తర్వులు విడుదల చేసింది. వాల్తేర్ డివిజన్ పేరును విశాఖపట్నం డివిజన్‌గా మారుస్తూ నిర్ణయం తీసుకుంది. విశాఖ డివిజన్ పరిధిని కూడా మార్పు చేస్తూ తాజాగా ఉత్తర్వులు రిలీజ్ అయ్యాయి. సౌత్ కోస్టల్ రైల్వే జోన్ పరిధిలోకి విశాఖ, విజయవాడ, గుంటూరు, గుంతకల్లు డివిజన్లు రానున్నాయి. రాయగడ రైల్వే డివిజన్ పరిధిని కూడా ఖరారు చేస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖ డివిజన్‌లో 410 కిలోమీటర్ల పరిధిని చేర్చారు రైల్వే అధికారులు. కొండపల్లి - మోటుమర్రి సెక్షన్‌ను సికింద్రాబాద్ డివిజన్ నుంచి విజయవాడ డివిజన్‌గా మారుస్తూ రైల్వే మంత్రిత్వ శాఖ నిర్ణయం తీసుకుంది. ఎన్నో రోజులుగా ఉత్తరాంధ్ర వాసులకు చిరకాల వాంఛగా ఉన్న సౌత్ కోస్టల్ రైల్వే జోన్ పరిధిని నిర్ణయించడంతో పాటు విశాఖ కేంద్రంగా విశాఖ రైల్వే డివిజన్‌ను ఏర్పాటు చేస్తూ కేంద్రం ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో పాటు విశాఖ రైల్వే డివిజన్ పరిధిలో మొత్తం 410 కిలోమీటర్ల రైల్వే ట్రాక్‌ను చేరుస్తూ నిర్ణయం తీసుకున్నారు. విశాఖ డివిజన్ పరిధిని కూడా మార్చింది కేంద్రం. విశాఖ డివిజన్ పరిధిలో ఏయే మార్గాలను చేరుస్తున్నారనే విషయాన్ని కూడా వెల్లడించింది కేంద్రం. అదే విధంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్ పరిధిలోకి విశాఖ, విజయవాడ, గుంటూరు, గుంతకల్లు డివిజన్లను మార్చారు. విశాఖ రైల్వే డివిజన్‌లో పలాస నుంచి విశాఖపట్నం దువ్వాడ, కూలేరు నుంచి విజయనగరం, నవపాడు జంక్షన్ వరకు.. సింహాచలం నార్త్ నుంచి దువ్వాడ బైపాస్ వరకు..

వడ్లపూడి నుంచి దువ్వాడ-విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ వరకు రైల్వే ట్రాక్ మొత్తం విశాఖ రైల్వే డివిజన్‌లోకి వస్తుందని కేంద్రం పేర్కొంది. రాయగడ రైల్వే డివిజన్‌లోని కొన్ని మార్గాలను విశాఖపట్నం రైల్వే డివిజన్ పరిధిలోకి తీసుకొచ్చారు. రెండు డివిజన్ల పరిధిని ఖరారు చేశారు. విశాఖ రైల్వే డివిజన్‌ను కొత్తగా ఏర్పాటు చేయడంతో సౌత్ కోస్టల్ రైల్వే జోన్ పరిధిలోకి దాన్ని మార్చేశారు. ఇంతకు ముందు గుంటూరు, గుంతకల్లు, విజయవాడ రైల్వే డివిజన్‌లు సౌత్ ఇంట్రన్ రైల్వే పరిధిలో ఉండేవి.. ఇప్పుడు వీటన్నింటినీ సౌత్ కోస్టల్ రైల్వే పరిధిలోకి తీసుకొస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. వాల్తేరు రైల్వే డివిజన్‌ను కొనసాగిస్తూ, విశాఖపట్నం డివిజన్‌గా పేరు మార్చుతూ రైల్వే బోర్డు అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయం ఉత్తరాంధ్ర ప్రజల ఆకాంక్ష సాకారం చేయడంతో పాటు, రైల్వే ఉద్యోగుల్లో సందేశాలను తొలగించింది. 132 సంవత్సరాల చరిత్ర కలిగిన వాల్తేరు డివిజన్‌ను కొనసాగిస్తోంది కేంద్రం. వాల్తేరును 'విశాఖపట్నం డివిజన్' గా పునర్ నామకరణం చేయాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్ హర్షం వ్యక్తం చేశారు. విశాఖ ప్రజల ఆకాంక్షను గౌరవిస్తూ కేంద్రం తీసుకున్న ఈ చారిత్రాత్మక నిర్ణయం విశాఖ అభివృద్ధికి కీలక మైలురాయిగా నిలవనుందన్నారు. ఈ 4 డివిజన్లతో విశాఖపట్నం రైల్వే మరింత బలోపేతం కానుంది. మెరుగైన మౌలిక వసతులు, రవాణా సేవలు అందుబాటులోకి రానున్నాయని ఎంపీ శ్రీభరత్ వివరించారు. విశాఖపట్నం డివిజన్ ఏర్పాటుతో రైల్వే మౌలిక వసతులు మరింత అభివృద్ధి చెందనున్నాయని శ్రీ భరత్ ఆశాభావం వ్యక్తం చేశారు. కొత్త రైల్వే ప్రాజెక్టులకు కేంద్రం నుంచి మరింత మద్దతు వచ్చే అవకాశం ఉంది. దాంతో రానున్న రోజుల్లో విశాఖపట్నం దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు హబ్‌గా మారనుంది. రైల్వే ప్రాజెక్టుల వేగవంతమైన అమలు, కొత్త రైళ్ల ప్రవేశం, ఆధునికీకరణ ప్రణాళికలు, మెరుగైన ప్రయాణ అనుభవానికి ఇదొక కీలక పరిణామని ఎంపీ శ్రీభరత్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ కి, సీఎం చంద్రబాబు కి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# అమృత్‌సర్‌లో దిగిన అమెరికా ప్రత్యేక విమానం

- **అక్రమంగా ఉంటున్నారన్న కారణంగా 205మంది రాక**
- **ట్రంప్ ఆదేశాలతో సైనిక విమానంలో తరలింపు**



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి5 (తీన్మార్ న్యూస్) :** చట్టవ్యతిరేకంగా అగ్రరాజ్యంలో అడుగుపెట్టిన వారిని ప్రత్యేక విమానంలో స్వదేశానికి పంపింది. 205 మందితో టెక్సాస్ నుంచి బయల్దేరిన అమెరికా సైనిక విమానం సీ-17.. బుధవారం మధ్యాహ్నం పంజాబ్‌లోని అమృత్‌సర్ అంతర్జాతీయ ఎయిర్‌పోర్టులో దిగింది. డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి రాగానే అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపిన అమెరికా ప్రభుత్వం.. కొంతమంది భారతీయులను కూడా వెనక్కి పంపిన సంగతి తెలిసిందే. వీరంతా పంజాబ్, దాని చుట్టుపక్కల రాష్ట్రాలకు చెందినవారిగా తెలుస్తోంది. అయితే, వీరిని అదుపులోకి తీసుకునేందుకు స్వదేశంలో ఎలాంటి ఆదేశాలు లేవని సమాచారం. అవసరమైన తనిఖీల అనంతరం ఎయిర్‌పోర్టు నుంచి బయటకు పంపించనున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. వెనక్కి పంపేముందు ప్రతిఒక్కరి రికార్డులను పరిశీలించినట్లు దిల్లీలోని అమెరికా ఎంబసీ అధికారులు వెల్లడించారు. రానున్న రోజుల్లో మరిన్ని విమానాలు అమెరికా నుంచి భారత్‌కు రానున్నాయని వివరించారు. అమెరికా హోంలాండ్ అధికారుల లెక్కల ప్రకారం.. 20,407 మంది భారతీయుల వద్ద సరైన పత్రాలు లేనట్లు గుర్తించిన అధికారులు.. 17,940 మందిని వెనక్కి పంపేందుకు తుది ఉత్తర్వులు జారీ చేశారు. 2,467 మంది ఎన్‌ఫోర్స్‌మెంట్ అండ్ రిమూవల్ ఆపరేషన్స్ నిర్బంధంలో ఉన్నారు. తొలివిడతలో భాగంగా 205 మందిని వెనక్కి పంపించారు. అక్రమవలసదారులపై ట్రంప్ మొదటి నుంచి కఠినంగా ఉంటున్నారు. ఆయన పదవీ బాధ్యతలు చేపట్టడంతో వారి గుర్తింపు, తరలింపు ప్రక్రియను వేగవంతం చేశారు. ఈ క్రమంలోనే ఎల్ పాసో, టెక్సాస్, శాన్ డియాగో, కాలిఫోర్నియాలో ఉన్న 5,000 మంది అక్రమ వలసదారులను ఆయా దేశాలకు తరలించేందుకు పెంటగాన్ సిద్ధమైంది. ఇప్పటికే కొంతమందిని సైనిక విమానాల్లో గటేమాలా, పెరు, హోండూరస్ తదితర దేశాలకు తరలించింది. అక్రమ వలసదారులపై అమెరికా అనుసరిస్తున్న విధానాల పట్ల ఇప్పటికే భారత్ తన స్పందనను తెలిపింది. అక్రమ వలసలకు తాము వ్యతిరేకమని, ఈ అంశం అనేక రకాల వ్యవస్థీకృత నేరాలతో ముడిపడి ఉందని పేర్కొంది. వీసా గడువు ముగిసినా లేదా సరైన దస్త్రాలు లేకుండా భారతీయులు అమెరికాతో సహా ఎక్కడ ఉన్నా వారిని తిరిగి తీసుకువచ్చేందుకు వీలు కల్పిస్తామని భారత విదేశాంగశాఖ స్పష్టం చేసింది.

# బలవంతంగా ఉద్యోగాలు పెరికివేస్తున్న ట్రంప్

**జాతీయ భద్రతతో కూడుకున్న సంస్థలకూ చోటు**

**సిఐఎలో వ్యతిరేకులపై ట్రంప్ కొరడా**

**వాషింగ్టన్,ఫిబ్రవరి 5 (తీన్మార్ న్యూస్) :** ఇటీవల ట్రంప్ ప్రకటించిన ప్యాకేజీలో భాగంగా ఉద్యోగం వదులుకుంటే వారికి 8 నెలల జీతాన్ని ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. దీనికి మంగళవారం వరకు గడువు ఉంచారు. కానీ, ఈ ఆఫర్‌లో జాతీయభద్రతతో సంబంధం ఉన్న సంస్థలను నాడు చేర్చలేదు. కానీ, కొత్త సీఐఏ డైరెక్టర్ జాన్ రాట్‌క్లిఫ్ మాత్రం ఈ ఆఫర్‌లో సీఐఏ కూడా ఉండాలని కోరుకుంటున్నట్లు ఆ వర్గాలు పేర్కొన్నాయి. ఇప్పటికే ఈ ఆఫర్‌ను ఉద్యోగులకు తెలియజేశారా, లేదా అన్నదానిపైనా, అలాగే ఎవరెవరికి వర్తిస్తాయనే అంశాలపైనా స్పష్టత లేదు. ఈ క్రమంలో తనను ఇబ్బందిపెట్టిన డీప్‌స్టేట్‌ను ఏమాత్రం సహించనని గతంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రకటన వాస్తవరూపం దాలుస్తోంది. ఏకంగా ప్రపంచవ్యాప్తంగా అమెరికా ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్‌కు గుండెకాయ వంటి సీఐఏపై ట్రంప్ కొరడా ఝుళిపించారు. ఆ సంస్థలోని ఉద్యోగులకు బైఅవుట్ ఆఫర్ చేసేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ విషయంతో సంబంధం ఉన్న ఇద్దరు వ్యక్తులు సీఎన్ఎన్‌కు వివరాలు వెల్లడించారు. అమెరికాలో ప్రభుత్వోద్యోగుల సంఖ్యను గణనీయంగా తగ్గించేందుకు ట్రంప్ కార్యవర్గం చేస్తున్న ప్రయత్నాల్లో ఇది కూడా ఒకటి. ఈవిషయాన్ని వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనంలో పేర్కొంది. గత వారం అమెరికాలోని ది ఆఫీస్ ఆఫ్ పర్సనల్ మేనేజ్‌మెంట్ నుంచి ది డైరెక్టర్ ఆఫ్ నేషనల్ ఇంటెలిజెన్స్‌లోని కొందరు ఉద్యోగులకు ఈ కార్యక్రమంలో భాగం కావాలని మార్గదర్శకాలు వెళ్లినట్లు సీఎన్ఎన్ కథనంలో పేర్కొంది. సీఏఐలోని కొందరు కీలక ఇంటెలిజెన్స్ ఆఫీసర్లు డీప్‌స్టేట్‌లో భాగమయ్యారని ట్రంప్, ఆయన సన్నిహితులు ఎప్పటినుంచో ఆరోపిస్తున్నారు. దీనికితోడు సీఐఏ సమాచార సేకరణ, విశ్లేషణలో కొన్ని విభాగాలు భారీగా ఖర్చు చేస్తున్నాయని కూడా భావిస్తున్నారు. మొత్తం అమెరికాలోనే ప్రభుత్వ ఉద్యోగులను తగ్గించేందుకు ఆఫీస్ ఆఫ్ పర్సనల్ మేనేజ్‌మెంట్ నుంచి గత నెల ఒక మెమో వెలువడింది. ఈమేరకు ఒక ఈ-మెయిల్ 20 లక్షల మంది ఉద్యోగులకు వెళ్లింది. స్వచ్ఛందంగా ఉద్యోగాలను వదులుకొంటే ఎనిమిది నెలల జీతం ఇస్తారని అందులో పేర్కొన్నారు. ఫిబ్రవరి 6వ తేదీలోపు దీనిపై ఓ నిర్ణయానికి రావాలని అందులో వెల్లడించారు.

# గాజాను స్వాధీనం చేసుకుంటామన్న ట్రంప్

**నెన్యాహుతో భేటీ అనంతరం సంచలన ప్రకటన**

**ట్రంప్ ప్రకటనపై మండిపడ్డ ఇస్లామిక్ దేశాలు, హమాస్**



**వాషింగ్టన్,ఫిబ్రవరి 5 (తీన్మార్ న్యూస్):** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. గాజాను స్వాధీనం చేసుకోవాలని భావిస్తున్నట్లు తెలిపారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూతో భేటీ అనంతరం ఆయన ఈ ప్రకటన చేశారు. ఇజ్రాయెల్, గాజా యుద్ధం నేపథ్యంలో తాజా పరిస్థితిపై నెతన్యాహూతో ట్రంప్ చర్చించారు. 'గాజాను అమెరికా స్వాధీనం చేసుకుంటుంది. అక్కడ ధ్వంసమైన భవనాలను పునరుద్ధరిస్తాం. ఆ ప్రాంతాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేస్తే.. అక్కడి ప్రజలకు అపరిమిత సంఖ్యలో ఉద్యోగాలు కల్పించవచ్చు, ఇళ్లు నిర్మించవచ్చు' అని ట్రంప్ పేర్కొన్నారు. ట్రంప్ ప్రకటన చరిత్రను మారుస్తుందని నెతన్యాహూ అభిప్రాయపడ్డారు. గాజాలో ఉద్రిక్తతల కారణంగా నిరాశ్రయులుగా మారిన పాలస్తీనీయులకు అరబ్ దేశాలు ఆశ్రయం కల్పించాలని ఇటీవల ట్రంప్ ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. అయితే, ఈ ప్రతిపాదనను ఆయా దేశాలు ఖండించాయి. అలా చేస్తే తమ ప్రాంతంలోని స్థిరత్వం దెబ్బతింటుందని ఈజిప్టు, జోర్డాన్, సౌదీఅరేబియా, యూఏఈ, ఖతార్, పాలస్తీనా అథారిటీ, అరబ్ లీగ్‌లు సంయుక్తంగా ప్రకటన చేశాయి. ఈక్రమంలోనే గాజాను స్వాధీనం చేసుకొని, అభివృద్ధి చేస్తామని ట్రంప్ ప్రకటించడం గమనార్హం. గాజాను స్వాధీనం చేసుకుంటానంటూ ట్రంప్ ప్రకటించడాన్ని హమాస్ ఖండించింది. ఆయన గందరగోళం సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారని మిలిటెంట్ సంస్థకు చెందిన ఓ సీనియర్ అధికారి పేర్కొన్నారు. 'ఈ ప్రాంతంలో గందరగోళం, ఉద్రిక్తతలు సృష్టించడా నికే ట్రంప్ ఈ ప్రకటన చేశారు. మా ప్రజలు దీన్ని ఆమోదించరు. వారి భూమి నుంచి వారిని తరలించడమే కాకుండా.. ఈ దురాక్రమణను అడ్డుకోవాల్సి ఉంది' అని సమీఅబు జుహ్రీ ఓ ప్రకటనలో తెలిపారు.

# నష్టాల్లో ముగిసిన సూచీలు.. 23,700 దిగువకు నిఫ్టీ




**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. అమెరికా- చైనా మధ్య నెలకొన్న వాణిజ్య యుద్ధ భయాలు, అధిక వెయిటేజీ షేర్లలో అమ్మకాల ఒత్తిడి సూచీలను పడేశాయి. దీంతో పాటు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మానిటరీ పాలసీ కమిటీ నిర్ణయాలు శుక్రవారం వెలువడనున్న నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తత పాటిస్తుండడం సూచీలు నష్టాలకు కారణమయ్యాయి. నిఫ్టీ 23,700 దిగువన ముగిసింది. సెన్సెక్స్ ఉదయం 78,704.60 (క్రితం ముగింపు 78,583.81) పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. తర్వాత నష్టాల్లోకి జారుకున్న సూచీ.. రోజంతా నష్టాల్లోనే కొనసాగింది. ఆఖర్లో మరింత అమ్మకాల ఒత్తిడితో 312.53 పాయింట్ల నష్టంతో 78,271.28 వద్ద ముగిసింది. నిఫ్టీ 42.95 పాయింట్ల నష్టంతో 23,696.30 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ మరో 39 పైసలు క్షీణించి 87.46 వద్ద ఆల్‌టైమ్ కనిష్ఠాన్ని తాకింది. సెన్సెక్స్ 30 సూచీలో ఏషియన్ పెయింట్స్, టైటాన్, నెస్లే ఇండియా, హిందుస్థాన్ యూనిలీవర్, ఎల్అండ్‌టీ షేర్లు నష్టాల్లో ముగిశాయి. అదానీ పోర్ట్స్, ఇండస్ ఇండ్ బ్యాంక్, టాటా మోటార్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టాటా స్టీల్ లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 75.53 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 2896 డాలర్ల స్థాయి వద్ద ట్రేడవుతోంది.

# ఓలా రెండు కొత్త మోటార్ సైకిళ్ల లాంచ్

విద్యుత్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ రోడ్‌స్టర్ సిరీస్‌లో రెండు కొత్త మోడళ్లను తాజాగా లాంచ్ చేసింది. ఇటీవలే మూడోతరం జనరేషన్ ప్లాట్‌ఫామ్‌పై రూపొందించిన విద్యుత్ స్కూటర్లను లాంచ్ చేసిన కంపెనీ.. తాజాగా రోడ్‌స్టర్ ఎక్స్ , రోడ్‌స్టర్ ఎక్స్‌ం పేరిట విద్యుత్ మోటార్‌సైకిల్స్‌ను విడుదల చేసింది. వేర్వేరు బ్యాటరీ వేరియంట్లలో ఇవి లభ్యమవుతాయి. వీటి ధర రూ.74,999 (ఎక్స్- షోరూమ్) నుంచి ప్రారంభం అవుతుంది. నేటి నుంచే బుకింగ్‌లు స్వీకరిస్తామని, వచ్చే నెల నుంచి డెలివరీలు ప్రారంభిస్తామని కంపెనీ సీఈఓ భవీశ్ అగర్వాల్ వెల్లడించారు.

- రోడ్ స్టర్ ఎక్స్‌లో మూడు బ్యాటరీ ప్యాక్స్ ఉన్నాయి. 2.5 కెడబ్ల్యూహెచ్ బ్యాటరీ బేస్ వేరియంట్ ధర రూ.74,999గా కంపెనీ ప్రకటించింది. ఇది సింగిల్ ఛార్జ్‌తో 144 కిలోమీటర్ల రేంజ్, టాప్ స్పీడ్ గంటకు 105 కిలోమీటర్లు వెళుతుంది.
- ఇక మిడ్ రేంజ్‌లో 3.5 కెడబ్ల్యూహెచ్ బ్యాటరీ వేరియంట్ ధర రూ.84,999గా కంపెనీ నిర్ణయించింది. ఇది సింగిల్ ఛార్జ్‌తో గరిష్ఠంగా 201 కిలోమీటర్ల వెళుతుందని, దీని టాప్ స్పీడ్ 118 కిలోమీటర్లుగా కంపెనీ పేర్కొంది.



- 4.5 కెడబ్ల్యూహెచ్ వేరియంట్ ధర రూ.94,999గా కంపెనీ నిర్ణయించింది. సింగిల్ ఛార్జ్‌తో ఇది గరిష్ఠంగా 259 కిలోమీటర్ల రేంజ్ ప్రయాణిస్తుందని కంపెనీ పేర్కొంది. దీని టాప్ స్పీడ్ 125 కిలోమీటర్లుగా కంపెనీ పేర్కొంది.
- ఓలా మూవ్‌ఓఎస్5తో ఈ బైక్స్ పనిచేస్తాయి. 4.3 అంగుళాల ఎల్‌సీడీ స్క్రీన్ అమర్చారు. స్పోర్ట్స్, నార్మల్, ఎకో మోడల్‌లు ఉన్నాయి. ఏబీఎస్, డిస్క్‌బ్రేక్స్ వంటి సదుపాయాలు ఉన్నాయి.

### రోడ్ స్టర్ ఎక్స్ ప్లస్

రోడ్ స్టర్ ఎక్స్ ప్లస్‌ను రెండు బ్యాటరీ ప్యాక్స్‌తో తీసుకొచ్చింది. 4.5 కెడబ్ల్యూహెచ్ బ్యాటరీ వేరియంట్ ధర రూ.1,04,999గా కంపెనీ నిర్ణయించింది. దీని ఐడీసీ రేంజ్ 259 కిలోమీటర్లు. ఇక 9.1 కెడబ్ల్యూహెచ్ వేరియంట్ ధర రూ.1,54,999 పేర్కొంది. దీని ఐడీసీ రేంజ్ 501 కిలోమీటర్లుగా కంపెనీ ప్రక టించింది. ఈ రెండు మోటార్ సైకిళ్ల టాప్‌స్పీడ్ గంటకు 125 కిలోమీటర్లు. క్రూయిజ్ కంట్రోల్, రివర్స్ మోడ్ వంటి ఫీచర్లతో వస్తోంది. సిరామిక్ వైట్, పైన్ గ్రీన్, ఇండస్ట్రియల్ సిల్వర్, స్టెల్లర్ బ్లూ, అంత్రాసైట్ రంగుల్లో లభిస్తాయి. లాంచింగ్ సందర్భంగా ప్రతి మోడల్‌పై రూ.15వేలు తగ్గింపు అందిస్తున్నట్లు ఓలా ఎలక్ట్రిక్ తెలిపింది. ఈ ధరలు కేవలం ఏడు రోజుల వరకు మా త్రమే ఉంటాయని స్పష్టంచేసింది. ఆ తర్వాత ధరలు పెరగ నున్నాయి.

# వన్నె తగ్గని పసిడి..

## 5శాతం పెరిగిన డిమాండ్



**ముంబయి:** దిగుమతి సుంకం తగ్గించడంతో దేశంలో బంగారానికి గిరాకీ పెరిగింది. దీనికి తోడు పెళ్లిళ్లు, పండగ సీజన్ కారణంగా 2024లో పసిడి డిమాండ్ 5శాతం పెరిగి 802.5 టన్నులకు చేరిందని ప్రపంచ స్వర్ణం మండలి వెల్లడించింది. ఈ ఏడాదిలోనూ పుత్తడి గిరాకీ ఇదే స్థాయిలో ఉండొచ్చని అంచనా వేసింది. 2024 ఏడాదికిగానూ ప్రపంచవ్యాప్తంగా పసిడి వినియోగంపై ప్రపంచ స్వర్ణం మండలి (డబ్ల్యూజీసీ) బుధవారం గణాంకాలు విడుదల చేసింది. దాని ప్రకారం, 2023లో బంగారం గిరాకీ 761 టన్నులుగా ఉండగా.. గతేడాది ఆ మొత్తం 802.8 టన్నులకు పెరిగింది. "2025లో బంగారం గిరాకీ 700-800 టన్నులు ఉండొచ్చని అంచనా వేస్తున్నాం. అయితే, ఈ ఏడాది ధరల్లో కొంత స్థిరత్వం వచ్చే అవకాశం ఉంది. దీంతో పెళ్లిళ్ల సీజన్‌లో బంగారు ఆభరణాల కొనుగోళ్లు పెరగొచ్చు" అని డబ్ల్యూజీసీ రీజినల్ సీఈఓ సచిన్ జైన్ వెల్లడించారు. దిగుమతి సుంకాలు తగ్గించినప్పటికీ గత ఏడాది కాలంలో దేశీయ మార్కెట్లో పసిడి ధర విపరీతంగా పెరుగుతోంది. కొన్ని నగరాల్లో పది గ్రాముల పుత్తడి ఏకంగా రూ.86వేల పైన పలుకుతోంది. మరోవైపు, గతేడాది బంగారంలో పెట్టుబడులు 29శాతం పెరిగి 239.4 టన్నులకు చేరినట్లు జైన్ తెలిపారు. 2013 తర్వాత పసిడి పెట్టుబడుల్లో ఇదే అత్యధికం కావడం విశేషం. 2023లో ఈ మొత్తం 185.2 టన్నులుగా ఉంది. ఇక, గతేడాది రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏకంగా 73 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేసినట్లు జైన్ వెల్లడించారు. 2023లో కొనుగోలు చేసిన 16 టన్నులతో పోలిస్తే ఇది ఏకంగా నాలుగు రెట్లు కావడం గమనార్హం. యుద్ధాలు, అధిక ద్రవ్యోల్బణం, ఇతర సవాళ్లను పరిగణనలోకి తీసుకొని రిస్కును తగ్గించుకునే ఉద్దేశంతో కేంద్ర బ్యాంకు బంగారం నిల్వలు పెంచుకునేందుకు ఆసక్తి చూపుతున్నట్లు నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# ఏడాదిలో చాట్‌జీపీటీకి భారత్ నుంచి 3 రెట్ల యూజర్లు : శామ్ ఆల్ట్‌మన్



ఓపెన్‌ఏఐకి చెందిన ఏఐ చాట్‌బాట్ చాట్‌జీపీటీను చాలామంది వినియోగిస్తున్నారు. గతేడాది యూజర్ల సంఖ్య భారత్‌లోనే మూడు రెట్లు పెరిగింది. ఈవిషయాన్ని ఓపెన్‌ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్ వెల్లడించారు. చాట్ జీపీటీకి ప్రపంచవ్యాప్తంగా భారత్ రెండో అతిపెద్ద మార్కెట్ అని పేర్కొన్నారు. శామ్ ఆల్ట్‌మన్ ప్రపంచవ్యాప్తంగా సుడిగాలి పర్యటన చేస్తున్నారు. మంగళ వారం రాత్రి భారత్‌కు చేరుకున్నారు. ఈసందర్భంగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆల్ట్‌మన్ ఈ వ్యాఖ్యలు చేశారు. "భారత్‌లోని ప్రజలు ఎక్కువగా స్టాక్, చిప్స్, మోడల్స్ ఇలా అద్భుతమైన అప్లికేషన్లపై దృష్టిసారిస్తున్నారు. దేశం ప్రతి విషయంలో ముందుకుసా గుతోంది. ఇక్కడి ప్రజలు చేసే అద్భుతాలు చూస్తే ఆశ్చర్యపో వాల్సిందే. భవిష్యత్తులో భారత్.. ఏఐ విప్లవాత్మక ప్రపంచంలో నాయకుడిగా ఎదగాలి" అని ఆల్ట్‌మన్ ఆకాంక్షించారు. ఏఐ మోడల్స్ నిర్మాణఖర్చుల తగ్గింపుపై ఎదురైన ప్రశ్నకు ఆయన స్పందించారు. "ప్రస్తుతం మనమంతా ఉజ్వల ప్రగతి సాధిస్తున్న ప్రపంచంలో ఉన్నాం. చిన్నచిన్న విషయాల ద్వారా పెద్ద ఘనత సాధించే దిశగా పయనిస్తున్నాం. ఇదేమీ చిన్న విషయం కాదు. చాలా విలువైంది. సృజనాత్మకంగా ఆలోచిం చేందుకు ఇది పునాదిగా మారుతుంది. ఈ అంశంలోనూ భారత్ అగ్రగామిగా నిలవాలి" అని పేర్కొన్నారు.

# 10 నుంచి అజాక్స్ ఇంజినీరింగ్ ఐపీఓ

## ధరల శ్రేణి, ఇతర వివరాలు ఇవీ..

ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీ కేదారా క్యాపిటల్ మద్దతు కలిగిన కాంక్రీట్ ఎక్విప్‌మెంట్ తయారీదారు అజాక్స్ ఇంజినీరింగ్ పబ్లిక్ ఇష్యూ ఫిబ్రవరి 10న ప్రారంభం కానుంది. ఫిబ్రవరి 12న సబ్‌స్క్రిప్షన్ ముగియనుంది. మొత్తం రూ.1269 కోట్లు సమీరించనుంది. ఐపీఓలో భాగంగా ఒక్కో షేరు ధరల శ్రేణిని రూ.599 - 629గా కంపెనీ నిర్ణయించింది. యాంకర్ ఇన్వెస్టర్లకు ఫిబ్రవరి ఏడో తేదీన సబ్‌స్క్రిప్షన్ విండో తెరుచుకోనుంది. ఐపీఓ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ రూపంలో జరగనుంది. పబ్లిక్ ఇష్యూలో భాగంగా 2.01 కోట్ల షేర్లను ప్రమోటర్లు, షేర్ హోల్డర్లు విక్రయించనున్నారు. కేదారా క్యాపిటల్ మొత్తం 74.37 లక్షల షేర్లను విక్రయించనుంది. పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ రూపంలో జరగనుండడంతో కంపెనీకి ఎలాంటి డబ్బులూ రాబోవు. అప్పర్ ప్రైస్ బ్యాండ్ వద్ద కంపెనీ మార్కెట్ విలువ రూ.7200 కోట్లుగా ఉండనుంది. ప్రముఖ కాంక్రీట్ ఎక్విప్‌మెంట్ తయారీ కంపెనీల్లో అజాక్స్ ఇంజినీరింగ్ ఒకటి. కర్ణాటకలో నాలుగు అసెంబ్లింగ్, తయారీ యూనిట్లు ఉన్నాయి. కర్ణాటకలో మరో యూనిట్ ఈ ఏడాది ఆగస్టు నాటికి అందుబాటులోకి ఆనుంది. 2023-24 ఆర్థిక సవత్సరంలో రూ.1741 కోట్ల ఆదాయాన్ని, రూ.225 కోట్ల నికర లాభాన్ని కంపెనీ ప్రకటించింది. ఈ ఐపీఓకు ఐసీఐసీఐ సెక్యూరిటీస్, సిటీగ్రూప్ గ్లోబల్ మార్కెట్స్ ఇండియా, జేఎం ఫైనాన్షియల్, నువామా వెల్త్ మేనేజ్‌మెంట్, ఎస్‌బీఐ క్యాపిటల్ మార్కెట్స్ బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్లుగా వ్యవహరించనున్నాయి.



### సెబీకి అట్లాంటా ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ దరఖాస్తు

ట్రాన్స్‌ఫార్మర్ల తయారీ కంపెనీ అట్లాంటా ఎలక్ట్రికల్ లిమిటెడ్ ఐపీఓ కోసం సెబీకి పత్రాలు సమర్పించింది. రూ.400 కోట్ల షేర్లను తాజాగా జారీ చేయనుండగా.. 38,10,895 షేర్లను ఆఫర్ ఫర్ సేల్ ప్రక్రియలో విక్రయించనున్నారు. ఇష్యూ ద్వారా సమీకరించిన నిధులను రుణాల చెల్లింపు, వర్కింగ్ క్యాపిటల్ అవసరాలు, సాధారణ కార్పొరేట్ అవసరాల కోసం కంపెనీ వినియోగించుకోనుంది. మోతీలాల్ ఓస్వాల్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్స్ లిమిటెడ్, యాక్సిస్ క్యాపిటల్ లిమిటెడ్ ఈ ఇష్యూకి బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్లుగా వ్యవహరిస్తున్నాయి.

# ఏఐపై ఫోకస్.. కృత్రిమ్‌లో 2వేల కోట్లు పెట్టుబడి : భవీశ్ అగర్వాల్



ఓలా ఎలక్ట్రిక్ వ్యవస్థాపకుడు భవీశ్ అగర్వాల్ తన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంస్థ కృత్రిమ్ ఏఐలో క్రమంగా పెట్టుబడులు పెంచుకుంటున్నారు. తాజాగా ఈ స్టార్టప్‌లో రూ.2వేల కోట్లు పెట్టుబడి పెట్టారు. వచ్చే ఏడాది నాటికి ఈ పెట్టుబడిని రూ.10వేల కోట్లకు పెంచాలని యోచిస్తున్నట్లు వెల్లడించారు. ఈవిషయాన్ని అగర్వాల్ 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు. కృత్రిమ మేధ సాంకేతికతను మెరుగుపరిచేందుకు కొత్త ఏఐ ల్యాబ్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ఏడాది నుంచి కృత్రిమ మేధ సాంకేతికతపై పనిచేస్తున్నట్లు అగర్వాల్ తెలిపారు. భారత్ కోసం ఏఐని అభివృద్ధి చేయడంపైనే తమ దృష్టి ఉందని పేర్కొన్నారు. దేశీయ భాషలు, డేటా కొరత.. వంటి వాటిపై ఏఐ పనితీరును మెరుగుపరిచేందుకు కృషి చేసినట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే భారత్ మొట్టమొదటి లార్జ్ లాంగ్వేజ్ మోడల్ కృత్రిమ్- 1ను లాంచ్ చేసింది. అది బేసిక్ 7బీ మోడల్. తాజాగా కృత్రిమ్-2 పేరిట మెరుగైన మోడల్‌ను విజన్ లాంగ్వేజ్ మోడల్ చిత్రార్థ్-1, స్పీచ్ ప్రాసెసింగ్ కోసం ధ్వని-1 ను ప్రవేశపెట్టనుంది. ఈ కృత్రిమ్ మోడళ్లు తెలుగుతో పాటూ.. ఇంగ్లీష్, హిందీ, బెంగాలీ, తమిళం, మరాఠీ, గుజరాతీ, కన్నడ, మలయాళం, ఒడియా, అస్సామీ ఈ భాషలకు సపోర్ట్ చేస్తాయి. ఇప్పటివరకు అమెరికా, చైనా సంస్థలు ఆవిష్కరించిన కృత్రిమమేధ (ఏఐ) మోడళ్లను ప్రపంచం వినియోగిస్తుండగా, మన దేశం నుంచీ సొంత ఏఐ మోడల్‌ను ఈ ఏడాదిలో ఆవిష్కరించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు కేంద్రం తాజాగా ప్రకటించింది. ఈనేపథ్యంలో భారత్‌లో మొట్టమొదటి జీబీ200ఏఐ సూపర్ కంప్యూటర్‌ను ఎన్విడియా భాగస్వామ్యంలో తీసుకొచ్చేందుకు కృత్రిమ్ సిద్ధమవుతోంది. మార్చి నాటికి ఇది అందుబాటులోకి రానున్నట్లు ఓలా సీఈఓ తెలిపారు. క్లౌడ్ ఆధారిత ఏఐ సేవ కృత్రిమ్ క్లౌడ్‌ను కూడా కంపెనీ ప్రారంభించినట్లు ఈసందర్భంగా ఆయన వెల్లడించారు. కృత్రిమ్ ఏఐని 2023లో ప్రారంభించారు. ఇప్పటికే వెంచర్ క్యాపిటల్ ఫండ్ మ్యాట్రిక్స్ పార్టనర్స్ ఇండియా నేతృత్వంలోని ఇతర పెట్టుబడిదారుల నుంచి 50 మిలియన్ డాలర్లను సమకూర్చుకుంది. దీంతో 2024లో భారత్ మొదటి యూనికార్న్‌గా అవతరించింది. బిలియన్ డాలర్ల క్లబ్‌లో చేరిన మొదటి భారతీయ ఏఐ సంస్థగానూ నిలిచింది.

# హెూండా, నిస్సాన్ విలీనం లేనట్లేనా..!

జపాన్‌కు చెందిన దిగ్గజ వాహన తయారీ సంస్థలు హెూండా మోటార్, నిస్సాన్ మోటార్ విలీనం కోసం గత కొంతకాలంగా చర్చలు జరుగుతున్నాయి. అయితే ఈ విలీన ప్రక్రియ ముందుకు కొనసాగడం లేదని తెలుస్తోంది. హెూండా కంపెనీతో విలీనం ప్రతిపాదనలను రద్దు చేసుకోవాలని నిస్సాన్ భావిస్తోందని సంబంధిత వ్యక్తులు తెలియజేసినట్లు ఆంగ్ల మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. త్వరలో ఈ అంశంపై భేటీ అయి నిస్సాన్ బోర్డు సభ్యులు నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పోటీని ఎదుర్కొనేందుకు జపాన్‌లోని రెండో అతిపెద్ద కార్ల తయారీ సంస్థ హెూండా, మూడో అతిపెద్ద సంస్థ నిస్సాన్ విలీన ప్రక్రియ కోసం చర్చలు జరుపుతున్నట్లు గతేడాది ప్రకటించాయి. చైనా వాహన తయారీ సంస్థ బీవైడీ, ఇతర ఎలక్ట్రిక్ వాహనాల సంస్థల నుంచి పోటీ ఎదుర్కొంటున్న తరుణంలో విలీనం కోసం సిద్ధమయ్యాయి. అయితే రెండు కంపెనీల మధ్య పెరుగుతున్న విభేదాల కారణంగా చర్చలు కష్టంగా మారాయని సంబంధిత వ్యక్తులు పేర్కొన్నారు. నిస్సాన్ కంటే దాదాపు ఐదు రెట్లు ఎక్కువ మార్కెట్ విలువ కలిగిన హెూండా.. దాని పునరుద్ధరణ ప్రణాళికలో భాగంగా నిస్సాన్ పురోగతిపై ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది. దాదాపు ఈ విలీనం రద్దు కావచ్చని జపాన్ మీడియాలో కథనాలు వస్తున్నాయి. అయితే ఈ అంశంపై ఇరు సంస్థల ప్రతినిధులు స్పందించేందుకు నిరాకరించారు.




# స్విగ్గీ క్యూ3 ఫలితాలు..

## 799 కోట్లకు పెరిగిన నష్టం

ప్రముఖ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ స్విగ్గీ త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికంలో ప్లాట్‌ఫామ్ నష్టం రూ.799 కోట్లుగా నమోదైందని కంపెనీ తెలిపింది. గతేడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.574 కోట్లతో పోలిస్తే నష్టం 39 శాతం పెరిగినట్లు తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది. కార్యకలాపాల నుంచి వచ్చే ఆదాయం 31 శాతం వృద్ధితో రూ.3,049 కోట్ల నుంచి రూ.3,993 కోట్లకు పెరిగిందని కంపెనీ తెలిపింది. తమ సేవలను మరింత విస్తరించడంలో భాగంగా బోల్ట్, స్నాక్ పేరిట 10 నిమిషాల డెలివరీ సేవల్ని ప్రారంభించామని కంపెనీ సీఈఓ శ్రీహర్ష మజేటీ అన్నారు. వీటితో పాటు రెస్టరంట్, ఈవెంట్ రిజర్వేషన్ల కోసం స్విగ్గీ సెన్సస్, స్విగ్గీ ప్రీమియం సేవల కోసం వన్ బ్లాక్ సబ్‌స్క్రిప్షన్ ప్రోగ్రామ్ తీసుకొచ్చినట్లు ఆయన తెలిపారు. ఫుడ్ డెలివరీ విభాగం ద్వారా వచ్చిన ఆదాయాన్ని క్విక్ కామర్స్ వ్యాపార విస్తరణకు, మార్కెటింగ్‌తో వినియోగించినట్లు తెలిపారు. ఒక్క జనవరిలోనే 86 ఇన్‌స్టామార్ట్ స్టోర్లను జోడించినట్లు ఆయన తెలిపారు. ఫలితాల నేపథ్యంలో మార్కెట్ ముగిసే సమయానికి స్విగ్గీ షేరు విలువ 3.56 శాతం నష్టంతో రూ.418.60 వద్ద ముగిసింది.



# 20లక్షల జాబ్‌పై జొమాటో సీఈఓ అప్‌డేట్

ప్రముఖ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ జొమాటో సీఈఓ దీపిందర్ గోయల్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ పొజిషన్‌కు దరఖాస్తులు ఆహ్వానించిన విషయం తెలిసిందే. తాజాగా దీనికి సంబంధించిన అప్‌డేట్‌ను ఆయన సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. తమ వద్దకు వచ్చిన 18 వేలకు పైగా అప్లికేషన్లలో 30 మందికి జాబ్ ఆఫర్లు అందించామని ఆయన తెలిపారు. తమతో కలిసి పనిచేసేందుకు ఎవరూ డబ్బు చెల్లించలేదని గోయల్ పేర్కొన్నారు. "మా వద్దకు వచ్చిన అప్లికేషనల్లో వడపోసి 150 మందిని ఎంపిక చేశాం. వారిలో 30 మందికి జాబ్ ఆఫర్లు అందించాం. అందులో 18 మంది ఇప్పటికే జొమాటో (బ్లింకిట్‌తో సహా) గ్రూప్‌లో అత్యున్నత స్థాయి హెూదా కల్పించాం. వారు చేస్తున్న పనికి తగ్గట్లు వారికి జీతభత్యాలు చెల్లిస్తున్నాం. మాతో కలిసి పనిచేసేందుకు ఎవరూ డబ్బు చెల్లించలేదు" అని దీపిందర్ గోయల్ అన్నారు. ప్రస్తుతం జొమాటోలో చేరిన వారిలో నలుగురు నేరుగా తనతో కలిసి పనిచేస్తున్నారని గోయల్ అన్నారు. వీరిలో ఇద్దరు చీఫ్ పొజిషన్లలో ఉన్నారని వెల్లడించారు. అయితే ఇది కేవలం ఒకసారి జరిపే నియామక ప్రక్రియ కాదని తెలిపారు. తమ వద్దకు వచ్చిన 18వేల మందికి పైగా అప్లికేషన్లలో నైపుణ్యం ఉన్న వారి కోసం ఇంకా అన్వేషిస్తున్నట్లు ఆయన తెలిపారు. అర్హులైన వ్యక్తుల్ని సంస్థలో నియమించుకోనున్నట్లు పేర్కొన్నారు. అయితే ఈ ప్రక్రియ ఆలస్యం అవుతుందని ఆయన తెలిపారు. జొమాటో గ్రూప్ సంస్థల్లో చీఫ్ ఆఫ్ స్టాఫ్ పొజిషన్‌కు దరఖాస్తులు ఆహ్వానించినప్పుడు ఎంపికైన వారికి ఎలాంటి వేతనమూ చెల్లించబోమని, అభ్యర్థే తిరిగి 20 లక్షలు చెల్లించాలన్న షరతు విధించారు. ఆ జాబ్ ఆఫర్‌పై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. నగదు చెల్లించగల ఆర్థిక స్తోమత ఉన్నవారి దరఖాస్తులను తిరస్కరించినట్లు తెలిపారు.




## ఐసీసీ ర్యాంకుల్లో అభిషేక్ నెంబర్ 2

ఇంగ్లండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో భారత యువ బ్యాటర్ అభిషేక్ శర్మ అదరగొట్టాడు. తాజాగా ప్రకటించిన ఐసీసీ ర్యాంకుల్లో దూసుకొచ్చాడు. ఏకంగా 38 స్థానాలను మెరుగు పర్చుకొని రెండో ర్యాంక్‌కు చేరాడు. ఇంగ్లండ్‌పై ఐదో టీ20లో సెంచరీ సాధించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం అభిషేక్ 829 పాయింట్లతో ఉన్నాడు. ఇక అగ్రస్థానంలో సన్‌రైజర్స్ పార్టనర్, ఆసీస్ ఓపెనర్ ట్రావిస్ హెడ్ (855 పాయింట్లు) కొనసాగుతున్నాడు. వీరిద్దరి తర్వాత తిలక్ వర్మ (803), ఫిల్ సాల్ట్ (798), సూర్యకుమార్ యాదవ్ (738) ఉన్నారు. ఇంగ్లండ్‌పై ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచిన వరుణ్ చక్రవర్తి కి ఐసీసీ ర్యాంకుల్లోనూ రివార్డు దక్కింది. మూడు స్థానాలను మెరుగుపర్చుకుని మూడో ర్యాంక్‌కు చేరాడు. విండీస్ బౌలర్ అకీల్ హుసేన్ (707) అగ్రస్థానంలో ఉండగా... అదిల్ రషీద్ (705), వరుణ్ చక్రవర్తి (705) పాయింట్లపరంగా ఒకే స్థానంలో ఉన్నప్పటికీ.. దశాంశంలో తేడాతో రషీద్ రెండులో నిలిచాడు. రవి బిష్ణోయ్ (671) నాలుగు ర్యాంకులు ఎగబాకి ఆరో ప్లేస్‌లో ఉన్నాడు. టెస్టుల్లోనూ బ్యాటింగ్, బౌలింగ్ ర్యాంకులను ఐసీసీ అప్‌డేట్ చేసింది. బౌలింగ్ విభాగంలో జస్‌ప్రీత్ బుమ్రా (908) అగ్రస్థానంలోనే కొనసాగుతున్నాడు. టాప్ -10లో బుమ్రా కాకుండా రవీంద్ర జడేజా కూడా ఉన్నాడు. జడ్డూ (745) తొమ్మిదో ర్యాంక్‌లో నిలిచాడు. ఇక బ్యాటర్ల విషయానికొస్తే.. ఇంగ్లండ్ ఆటగాడు జో రూట్ (895) అగ్రస్థానంలో ఉన్నాడు. టాప్ -10లో కేవలం ఇద్దరు భారత బ్యాటర్లు మాత్రమే ఉన్నారు. యశస్వి జైస్వాల్ (847) నాలుగో ప్లేస్, రిషభ్ పంత్ (739) తొమ్మిదో స్థానంలో నిలిచాడు.



## విరాట్ కోహ్లీని టీజ్ చేసిన పాట్ కమిన్స్.. వీడియో వైరల్!

భారత స్టార్ విరాట్ కోహ్లీ గత ఆస్ట్రేలియా పర్యటనలో విఫలమైన సంగతి తెలిసిందే. ఈ ఒక్క సిరీస్ మినహా ప్రతిసారీ ఆసీస్‌పై అద్భుతమైన ఆటతీరును ప్రదర్శించాడు. ఇప్పుడు ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌తోపాటు ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీకి కోహ్లీ సన్నద్ధమవుతున్నాడు. ఈ క్రమంలో విరాట్‌ను ఆసీస్ కెప్టెన్ పాట్ కమిన్స్ టీజ్ చేసిన వీడియోలు వైరల్‌గా మారాయి. అదేంటి మైదానంలో కోహ్లీని ఒక్క మాట అనలేదు కదా.. ఇదెప్పుడు జరిగిందనే అనుమానం అక్కర్లేదు. ఇది ఛాంపియన్స్ ట్రోఫీ కోసం తీసిన యాడ్ వీడియో. ఇందులో కమిన్స్ షేవింగ్ చేసుకుంటూ అద్దంలో చూస్తూ ఉంటాడు. ఆ సమయంలో 'హాయ్ కోహ్లీ. నువ్వు ఇప్పటివరకు ఇలా నెమ్మదిగా ఆడటం చూడలేదు. చాలా నెమ్మదిగా ఆడావు' అంటూ వ్యాఖ్యలు చేశాడు. ఆ వీడియోను మీరూ చూసేయండి. ఇప్పటికే ఆల్‌రౌండర్ మిచెల్ మార్ష్ సేవలను కోల్పోయిన ఆసీస్‌కు మరో షాక్ తగిలేలా ఉంది. వ్యక్తిగత కారణాలతో శ్రీలంక పర్యటనకు దూరంగా ఉన్న కెప్టెన్ పాట్ కమిన్స్ ఛాంపియన్స్ ట్రోఫీలో ఆడటం కష్టమేనని తెలుస్తోంది. చీలమండ సమస్యతో బాధ పడుతున్నట్లు ఆసీస్ కోచ్ మెక్‌డొనాల్డ్ వెల్లడించాడు. ఒకవేళ కమిన్స్ గైర్హాజరైతే స్టీవ్ స్మిత్ లేదా ట్రావిస్ హెడ్‌లో ఒకరికి సారథ్యం అప్పగించే అవకాశం ఉంది.

## టీ20ల్లో రషీద్ ఖాన్ నయా ప్రపంచ రికార్డు

### 632 వికెట్లు పడగొట్టిన పిన్న వయస్కుడు



ప్రపంచ క్రికెట్‌లో తాజాగా ఓ అరుదైన ఘనత నమోదైంది. టీ20ల్లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా అఫ్గానిస్థాన్ కెప్టెన్ రషీద్ ఖాన్ చరిత్రకెక్కాడు. సౌతాఫ్రికా వేదికగా జరుగుతోన్న టీ20 లీగ్‌లో ఈ రికార్డును సాధించాడు 26 ఏళ్ల స్టార్ క్రికెటర్. ఎంఐ కేప్‌టౌన్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న రషీద్, పార్ల్ రాయల్స్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో రెండు వికెట్లను తన ఖాతాలో వేసుకున్నాడు. దీంతో టీ20ల్లో (అంతర్జాతీయ ం లీగ్‌లు) కలిపి 633 వికెట్లను పడగొట్టాడు. ఇందులో అఫ్గాన్ తరఫున మాత్రమే 161 వికెట్లు తీశాడు. మిగిలిన 472 వికెట్లు డొమెస్టిక్ క్రికెట్‌తో పాటు వివిధ లీగుల్లో పడగొట్టినవే కావడం విశేషం. ఇదిలా ఉండగా, 461 మ్యాచుల్లో 18.08 సగటుతోనే అత్యధిక వికెట్లను పడగొట్టి రషీద్ ఈ రికార్డును సాధించాడు. అయితే వెస్టిండీస్ మాజీ స్టార్ ఆల్‌రౌండర్ డ్వేన్ బ్రావో 582 మ్యాచుల్లో 24.40 సగటుతో 631 వికెట్లు పడగొట్టాడు.

# రోహిత్, కోహ్లీపైనే అందరి దృష్టి

## తొలి వన్డేలో కీలక మార్పులు!

### నేడు నాగ్‌పూర్ వేదికగా తొలివన్డే



ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీకి సన్నాహకంగా భావిస్తున్న భారత్-ఇంగ్లాండ్ మధ్య మూడు వన్డేల సిరీస్‌కు రంగం సిద్ధమైంది. ఇరు జట్ల మధ్య తొలివన్డే గురువారం నాగ్‌పూర్ వేదికగా జరగనుంది. టీ20 సిరీస్‌ను 4-1తో నెగ్గిన టీమ్‌ఇండియా వన్డేల్లో కూడా అదే ఆధిపత్యం చలాయించాలని కోరుకుంటోంది. అయితే టీ20ల కంటే భిన్నమైన బ్యాటింగ్ లైనప్‌తో వన్డేల్లో భారత జట్టు బరిలోకి దిగుతుండటం గమనార్హం. ఛాంపియన్స్ ట్రోఫీ కంటే ముందు ఆటగాళ్ల ఫామ్, ఫిటినెస్‌పై ఈ సిరీస్ ద్వారా టీమ్‌మేనేజ్‌మెంట్ ఒక అంచనాకు వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా పేలవమైన ఫామ్‌తో సతమతమౌతున్న సీనియర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీపైనే ఈ సిరీస్‌లో అందరి దృష్టి నెలకొంది. గత నెలలో జరిగిన రంజీ ట్రోఫీలో కూడా ఈ ఇద్దరు సీనియర్ ఆటగాళ్లు విఫలమయ్యారు. 2023 వన్డే వరల్డ్‌కప్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ల జాబితాలో కోహ్లీ, రోహిత్ తొలి రెండు స్థానాల్లో ఉన్నారు. ఆ తర్వాత శ్రీలంకతో జరిగిన మూడు వన్డేల సిరీస్‌లో మాత్రమే వీరిద్దరూ ఆడారు. అందులో రోహిత్ రెండు అర్ధశతకాలు నమోదు చేయగా, కోహ్లీ విఫలమయ్యాడు. మళ్లీ ఇప్పుడు ఇంగ్లాండ్‌తో సిరీస్‌లోనే వీరిద్దరూ వన్డే ఫార్మాట్‌లో ఆడనున్నారు. ఇప్పటికే టీ20ల నుంచి రిటైరైన రోహిత్, కోహ్లీ ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత తమ వన్డే భవిష్యత్తుపై ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. శుభమన్ గిల్‌తో కలిసి రోహిత్ శర్మ భారత ఇన్నింగ్స్‌ను ఆరంభించనున్నాడు. వికెట్ కీపర్ స్థానం కోసం కేఎల్? రాహుల్, రిషభ్ పంత్ మధ్య పోటీ నెలకొంది. పంత్ గైర్హాజరీలో 2023 వరల్డ్‌కప్‌లో కేఎల్ రాహుల్ వికెట్ కీపింగ్ బాధ్యతలు నిర్వహించాడు. మిడిల్ ఆర్డర్‌లో కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, హర్దిక్ పాండ్యా బరిలోకి దిగనున్నారు. స్పిన్ ఆల్‌రౌండర్ స్థానం కోసం రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్ మధ్య పోటీ నెలకొంది. ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్‌లో అద్భుతంగా బౌలింగ్ చేసిన మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తిని వన్డే జట్టులో కూడా చేర్చారు. కులదీప్, వరుణ్ చక్రవర్తి ఇద్దరిలో ఒకరికే తుదిజట్టులో చోటు దక్కవచ్చు. ఇక సీనియర్ పేసర్ మహమ్మద్ షమీ, అర్ష్‌దీప్ సింగ్ పేస్ బౌలింగ్ బాధ్యతలు పంచుకోనున్నారు. గురువారం మధ్యాహ్నం ఒంటి గంటా 30 నిమిషాలకు మ్యాచ్ ఆరంభం కానుంది. వెన్ను నొప్పికి గురైన స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్‌కు దూరమయ్యాడు. ఇక అతడి ప్లేసులో ఇంగ్లాండ్‌తో 5 టీ20ల సిరీస్‌లు అద్భుతంగా రాణించిన.. స్పిన్నర్ వరుణ్ చక్రవర్తిని జట్టులోకి తీసుకున్నారు.




## ఛాంపియన్స్ ట్రోఫీ అనంతరం రిటైర్‌మెంట్‌పై రోహిత్ నిర్ణయం?

మరో రెండు వారాల్లో ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభం కానుంది. రోహిత్ శర్మ నాయకత్వంలో టీమ్‌ఇండియా బరిలోకి దిగనుంది. గతేడాది టీ20 ప్రపంచకప్ తర్వాత పొట్టి ఫార్మాట్‌కు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. ఆసీస్‌తో టెస్టు సిరీస్ సమయంలోనూ సంచలన నిర్ణయం తీసుకుంటాడని వార్తలు వచ్చాయి. అయినా టెస్టులకు గుడ్‌బై చెప్పలేదు. ఇప్పుడు ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత వీడ్కోలు నిర్ణయం తీసుకుంటాడని సమాచారం. మరోవైపు బీసీసీఐ కూడా భవిష్యత్తు సారథ్యంపై ఆలోచన చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ 2025-27 సీజన్‌తోపాటు వన్డే ప్రపంచ కప్ 2027 కోసం టీమ్‌ను సిద్ధం చేసేందుకు బీసీసీఐ సమాయత్తమవుతోంది. అందులో భాగంగా సీనియర్ల భవితవ్యంపై ఓ స్పష్టత కోరే అవకాశం ఉందని క్రికెట్ వర్గాలు చెబుతున్నాయి. రోహిత్‌తో పోలిస్తే విరాట్ కోహ్లీ ఫిట్‌నెస్ బాగుంటుందని.. మరికొన్నేళ్లు జాతీయజట్టుకు ఆడే అవకాశం ఉంది. అంతర్జాతీయ క్రికెట్‌కు రోహిత్ శర్మ వీడ్కోలు పలికితే అతడి స్థానంలో రెండు ఫార్మాట్లకు కెప్టెన్లను నియమించాల్సి ఉంటుంది. టెస్టులకు జస్‌ప్రీత్ బుమ్రా, రిషభ్ పంత్ రేసులో ఉండగా.. వన్డేలకు శుభ్‌మన్ గిల్, పంత్ ఉన్నట్లు తెలుస్తోంది. యశస్వి జైస్వాల్‌కు సుదీర్ఘ ఫార్మాట్ బాధ్యతలు అప్పగించాలనేవారూ లేకపోలేదు. "గత సెలక్షన్ కమిటీ సమావేశంలోనే రోహిత్‌తో సెలక్టర్లు, బీసీసీఐ బోర్డు సభ్యులు చర్చలు జరిపారు. కాస్త సమయం కావాలని రోహిత్ అప్పుడు చెప్పాడు. ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత భవిష్యత్తుపై నిర్ణయం తీసుకోవచ్చు. డబ్ల్యూటీసీ కొత్త సీజన్‌తోపాటు వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలోఉంచుకొని మేనేజ్‌మెంట్ ప్రణాళికలను సిద్ధం చేయనుంది. ప్రతిఒక్కరితో చర్చలు జరిపి భారత జట్టులో మార్పులు తీసుకురావాలనేది బోర్డు అభిమతం. సారథులుగా ఎవరిని నియమిస్తారనేది ఆసక్తికరంగా మారింది. బుమ్రా సారథ్యంపై ఎలాంటి ఇబ్బంది లేకపోయినా.. గాయాల బెడద అతడికి సానుకూలంగా ఉండకపోవచ్చు. అందుకే, నిలకడగా ఉండే ప్లేయర్ వైపు మేనేజ్‌మెంట్ మొగ్గు చూపే అవకాశం ఉంది. రిషభ్ పంత్ బలమైన అభ్యర్థి. అతడితోపాటు యశస్వి కూడా ఈ రేసులో ఉన్నాడు" అని బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి.

## వరుణ్‌ను తీసుకోవడం మంచిదే : చోప్రా



వరుణ్ చక్రవర్తిని వన్డేల్లోకి తీసుకోవడం మంచి నిర్ణయమని భారత మాజీ క్రికెటర్, వ్యాఖ్యాత ఆకాశ్ చోప్రా ప్రశంసించాడు. అయితే, అతడిని బెంచ్‌కే పరిమితం చేయొద్దని సూచించాడు. ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా వరుణ్ చక్రవర్తి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు దక్కించుకున్నాడు. దీంతో అతడిని చివరి క్షణంలో వన్డే సిరీస్‌కు మేనేజ్‌మెంట్ తీసుకుంది. ఛాంపియన్స్ ట్రోఫీ సన్నాహకంగా ఉన్న ఇంగ్లండ్‌తో సిరీస్‌లో రాణిస్తే ఐసీసీ టోర్నీలోకి ఎంట్రీ ఇవ్వడం ఖాయంగానే కనిపిస్తోంది. "వరుణ్ చక్రవర్తి ఎంపిక అద్భుతం. నా టీమ్‌లో అతడికి చోటు కల్పించా. ఫింగర్ స్పిన్నర్ల అవసరం ఉండదు. కానీ, మణికట్టు మాంత్రికులే పెద్ద పాత్ర. అయితే, ఛాంపియన్స్ ట్రోఫీ కోసం సెలక్టర్లు అతడిని ఎంపిక చేయలేదు. ఇప్పుడు వన్డేల్లోకి తీసుకున్నారు. అతడి ఫామ్‌ను ఉపయోగించుకోవానుకోవడం సరైన నిర్ణయం. అయితే, అతడిని బెంచ్‌కే పరిమితం చేయొద్దని కోరుతున్నా. ప్రతి మ్యాచ్‌లోనూ ఆడించాలి" అని చోప్రా తెలిపాడు.

**షమీ విషయంలో..** "ఛాంపియన్స్ ట్రోఫీ కోసం జస్‌ప్రీత్ బుమ్రా, షమీని తీసుకున్నారు. అర్ష్‌దీప్ సింగ్ మూడో పేసర్. ఇక హార్దిక్ పాండ్య జట్టులో ఉన్నాడు. కానీ, బుమ్రాకు సంబంధించిన గుడ్‌న్యూస్ వచ్చేలా లేదు. అతడి ఫిట్‌నెస్‌పై ఇంకా సందిగ్ధత కొనసాగుతోంది. పూర్తిగా తెలియకుండా మనం మాట్లాడుకోకూడదు. అయితే, ఛాంపియన్స్ ట్రోఫీలో నలుగురు పేసర్లు 100 శాతం ఫిట్‌నెస్‌తో ఉండాల్సిందే. కానీ, షమీ విషయంలో నాకు ఇంకా అనుమానాలు ఉన్నాయి. గత మ్యాచ్‌లో మూడు వికెట్లు తీశాడు. కానీ, వన్డేలకు అతడు పూర్తిగా సిద్ధమైనట్లు అనిపించడం లేదు. అందుకే, మరొక పేసర్‌ను స్క్వాడ్‌లోకి తీసుకోవాలని సూచిస్తున్నా. సిరాజ్ వెళ్లే అవకాశం ఉంది" అని చోప్రా వ్యాఖ్యానించాడు. ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌కు బుమ్రాకు బ్యాకప్‌గా హర్షిత్ రాణాను బీసీసీఐ సెలక్టర్లు ఎంపిక చేశారు.




## 15 నెలల తర్వాత జో రూట్ ఎంట్రీ..

### భారత్‌తో తొలి వన్డేకు ఇంగ్లాండ్ తుది జట్టు ఇదే

భారత్, ఇంగ్లాండ్ మధ్య వన్డే సమరానికి అంతా సిద్ధమైంది. ఫిబ్రవరి 6న నాగ్‌పూర్‌లో తొలి మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌కు ఇంగ్లాండ్ ఒక రోజు ముందే తుది జట్టును ప్రకటించింది. కొన్నాళ్లుగా టెస్టులపైనే ఫోకస్ పెట్టిన బ్యాటర్ జో రూట్ దాదాపు 15 నెలల తర్వాత వన్డే మ్యాచ్ ఆడనున్నాడు. రూట్ చివరి వన్డే భారత్‌లోనే (ఈడెన్ గార్డెన్స్) ఆడాడు. 2023 వన్డే ప్రపంచ కప్‌లో నవంబర్ 11న పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆడాడు. టీమ్‌ఇండియాతో ఐదు టీ20ల సిరీస్‌లో ఒక్క మ్యాచ్‌లోనే గెలిచిన ఇంగ్లిష్ జట్టు మూడు వన్డే సిరీస్‌లో భారత్‌కు గట్టిపోటీ ఇవ్వాలనుకుంటోంది. ఈ క్రమంలోనే తొలి మ్యాచ్ కోసం బలమైన ఆటగాళ్లతో తుది జట్టును ఎంపిక చేసింది.

**తొలి వన్డేకు ఇంగ్లాండ్ తుది జట్టు**

బెన్ డకెట్, ఫిల్ సాల్ట్ (వికెట్‌కీపర్), జో రూట్, హ్యారీ బ్రూక్, జోస్ బట్లర్ (కెప్టెన్), లియామ్ లివింగ్‌స్టన్, జాకబ్ బెతెల్, బ్రైడన్ కార్స్, జోఫ్రా ఆర్చర్, ఆదిల్ రషీద్, సాకిబ్ మహమూద్.

# అలాంటి పాత్రలో బాలకృష్ణ చేయడమే విచిత్రం : పరుచూరి గోపాలకృష్ణ



సినీ రంగానికి బాలకృష్ణ చేసిన సేవలకు కేంద్ర ప్రభుత్వం ఆయనకు పద్మభూషణ్ పురస్కారం ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా దీనిపై ప్రముఖ రచయిత పరుచూరి గోపాలకృష్ణ ఆనందం వ్యక్తంచేశారు. పరుచూరి పలుకుల్లో భాగంగా ఓ ప్రత్యేక వీడియో విడుదల చేశారు. "పద్మ పురస్కారాలు సామాన్యమైనవి కావు. బాలకృష్ణ కేవలం ఒక నటుడిగానే ఇది సాధించలేదు. ఆయన చేసిన సమాజసేవ, ప్రజా సేవలకు గాను ఈ అవార్డు వరించింది. 50 ఏళ్ల కిత్రం తొలిసారి మేకప్ వేసుకున్నారు. అప్పటినుంచి ఇప్పటివరకు నటుడిగా అంచెలంచెలుగా ఎదుగుతూనే ఉన్నారు. 2014 నుంచి రాజకీయ సేవ చేస్తున్నారు. హిందూపురంలో ఆయన ఎన్ని గొప్ప కార్యక్రమాలు చేస్తున్నారో అందరికీ తెలిసిందే. బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి ద్వారా ఎంతోమందికి ఆయన ప్రాణదానం చేస్తున్నారు. ఈ మూడు సేవల కారణంగానే ఆయనకు ఈ అవార్డు వరించిందని నా అభిప్రాయం". "ఒక నటుడిగా బాలకృష్ణ ఎన్నో జానర్ సినిమాల్లో చేశారు. ఈ మధ్యకాలంలో అన్నీ జానర్‌లలో నటించేవారు తక్కువమంది ఉన్నారు. ఆయన సినీ ప్రయాణంలో ఎన్నో గొప్ప విజయాలు చూశారు. చాలా సినిమాలు కమర్షియల్‌గా విజయాన్ని అందుకున్నాయి. 'ఆదిత్య 369'తో అద్భుతాన్ని సృష్టించారు. అలాగే 'సమరసింహారెడ్డి' తెలుగు సినీరంగంలో ఓ సంచలనం. ఫ్యాక్షన్ సినిమాలకు ఓ బాట చూపించిన చిత్రమది. ఆయన్ని అలాంటి పాత్రలో చూపించడానికి చాలా భయపడ్డాం. కానీ, ఊహించిన దానికంటే విజయం సాధించింది. 'తిరుపతి వెంకటేశ్వర కల్యాణం'లో బాలకృష్ణ నారదుడిగా చేశా రు. అలాంటి పాత్రలో ఆయన్ని ఊహించుకోవడమే ఒక విచిత్రం. నందమూరి తారకరామారావు చేసినట్లే ఎన్నో జానర్‌లలో గొప్ప పాత్రలు వేశారు. ఇప్పటికి మూడుసార్లు నంది అవార్డు తీసుకున్నారు. ఇక బసవతారకం ఆసుపత్రి ద్వారా సమాజ సేవ చేస్తున్నారు. మరోవైపు రాజకీ యంగానూ తన మార్క్ చూపించారు. మచ్చలేని రాజకీయ నాయకుడిగా కొనసాగుతున్నారు. అలాంటి వ్యక్తికి పద్మభూషణ్ వచ్చిందంటే ఎంతో ఆనందంగా ఉంది" అని అన్నారు.

# నెట్‌ఫ్లిక్స్‌లో 'పుష్ప 2' హవా.. ఏడు దేశాల్లో టాప్



అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన యాక్షన్ థ్రిల్లర్ 'పుష్ప2: ది రూల్'. ప్రపంచవ్యాప్తంగా డిసెంబర్ 4న విడుదలైన ఈ సినిమా థియేటర్‌లలో రికార్డులు నెలకొల్పి చరిత్ర సృష్టించింది. భారీ విజయాన్ని అందుకున్న 'పుష్ప 2' జనవరి 30న నెట్‌ఫ్లిక్స్ వేదికగా అందుబాటులోకి వచ్చింది. తాజాగా ఈ చిత్రం నెట్‌ఫ్లిక్స్‌లోనూ రికార్డు సృష్టించింది. ఓటీటీలోకి వచ్చిన నాటినుంచి వ్యూస్ పరంగా టాప్‌లో ఉన్న 'పుష్ప 2' తాజాగా ఏడు దేశాల్లో నంబర్ వన్ స్థానాన్ని కైవసం చేసుకుంది. అలాగే ప్రపంచవ్యాప్తంగా ఆంగ్లేతర సినిమాల విభాగంలో 5.8 మిలియన్ల వ్యూస్‌తో నెట్‌ఫ్లిక్స్‌లో రెండో స్థానంలో నిలిచింది. ఇది తెలుగు సినిమాకు దక్కిన అరుదైన ఘనత అని అభిమానులు అంటున్నారు. ఈ వీక్షణల సంఖ్య పెరిగే అవకాశం ఉందని కామెంట్స్ చేస్తున్నారు. మొదట 3 గంటల 20 నిమిషాల నిడివితో విడుదలైన 'పుష్ప 2'కు అదనంగా ఇటీవల మరో 20 నిమిషాల సన్నివేశాలను జత చేశారు. దీంతో సినిమా నిడివి దాదాపు 3 గంటల 40 నిమిషాలు అయింది. ఇక ఓటీటీ వెర్షన్ కూడా ఇదే నిడివితో అందుబాటులో ఉంది.

### ఎంతో సంతోషంగా ఉంది : అల్లు శిరీష్

'పుష్ప 2' ఓటీటీలోకి అందుబాటులోకి వచ్చిన తర్వాత ఇంటర్నేషనల్ ఆడియన్స్ ఈ సినిమాలోని యాక్షన్ సన్నివేశాలపై ప్రశంసలు కురిపిస్తున్నారు. ప్రత్యేకించి జాతర ఎపిసోడ్‌కు వారంతా ఫిదా అవుతున్నారు. ఎక్స్ వేదికగా ఆ సీన్‌ను షేర్ చేస్తూ చిత్రబృందాన్ని అభినందిస్తున్నారు. తన సోదరుడి సినిమాకు ఈ స్థాయిలో ప్రశంసలు రావడం ఎంతో సంతోషంగా ఉందని అల్లు శిరీష్ పోస్ట్ పెట్టారు. "పుష్ప2: ది రూల్' ఇంటర్నేషనల్ ఆడియన్స్ నుంచి విశేషమైన ఆదరణ అందుకుంటున్నందుకు ఆనందంగా ఉంది. ఇలాంటి చిత్రాలు వారి సంస్కృతికి భిన్నమైనప్పటికీ దాన్ని వాళ్లు ఆదరిస్తున్న తీరు ఆశ్చర్యంగా ఉంది" అంటూ చిత్ర బృందానికి అభినందనలు తెలిపారు.

# వ్యాపారవేత్తగా కంగనా రనౌత్.. కల నెరవేరిందంటూ పోస్ట్



బాలీవుడ్ నటి, ఎంపీ కంగనా రనౌత్ వ్యాపారరంగంలోకి అడుగుపెట్టారు. ఫుడ్ బిజినెస్ మొదలుపెడుతున్నానని తెలియజేస్తూ తాజాగా ఆమె ఇన్‌స్టా వేదికగా పోస్ట్ పెట్టారు. 'ది మౌంటైన్ స్టోరీ' పేరుతో హిమాలయాల్లో కేఫ్ ఏర్పాటుచేశారు. ఫిబ్రవరి 14 నుంచి ఇది ప్రారంభం కానుంది. ఈమేరకు రెస్టారంట్ ఫొటోలను నెటిజన్లతో పంచుకున్నారు. సంప్రదాయ హిమాచల్ ఫుడ్‌ను మోడ్రన్ అభిరుచులకు అనుగుణంగా అందించడమే లక్ష్యంగా దీనిని ఏర్పాటుచేశానని తెలిపారు. "నా చిన్ననాటి కల ఎట్టకేలకు ప్రాణం పోసుకుంది. హిమాలయాల ఒడిలో నా చిన్న కేఫ్. ది మౌంటెన్ స్టోరీ.. ఇదొక ప్రేమకథ" అని ఆమె పేర్కొన్నారు. ఫుడ్ బిజినెస్‌లో ఇప్పటికే పలువురు తారలు రాణిస్తున్నారు. శిల్పాశెట్టి, మలైకా అరోరా, మౌనీరాయ్, రకుల్ ప్రీత్ సింగ్ వంటి తారలకు రెస్టారంట్లు ఉన్నాయి. వర్క్ లైఫ్ విషయానికి వస్తే.. కంగనారనౌత్ నటించిన 'ఎమర్జెన్సీ' ఇటీవల విడుదలైంది. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ రాజకీయ జీవితాన్ని ఆధారం చేసుకొని ఈ సినిమా రూపుదిద్దుకుంది. ఇందిరాగాంధీగా కంగనా, జయప్రకాశ్ నారాయణ్ పాత్రలో అనుపమ్ ఖేర్, అటల్ బిహారీ వాజ్‌పేయీగా శ్రేయాస్ తల్పడే నటించారు. ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని జనవరి 17న విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మిశ్రమ స్పందనలకు పరిమితమైంది. ప్రస్తుతం ఆమె మాధవన్‌తో సినిమా చేస్తున్నారు. ఇటీవల ఈ సినిమా చిత్రీకరణ మొదలైంది. ఆ విషయాన్ని తెలియజేస్తూ సోషల్‌మీడియాలో పోస్ట్ పెట్టారు.

# కోహ్లీ వీడియో.. ఫ్రాడ్ అంటూ అనుష్క మెసేజ్ : మాధవన్



ముంబయి: ఏఐ టెక్నాలజీని ఉద్దేశించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు నటుడు మాధవన్. ఆ టెక్నాలజీ కారణంగా ఎదురయ్యే సమస్యలపై ఆయన తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. దానివల్ల గతంలో తాను ఇబ్బందికర పరిస్థితి ఎదుర్కొన్నానని అన్నారు. "ఏఐ వల్ల నేను కూడా మోసపోయాను. గతంలో సోషల్‌మీడియాలో నేనొక వీడియో చూశాను. ఫుట్‌బాల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో... మన క్రికెటర్ కోహ్లీని ప్రశంసలతో ముంచెత్తున్న వీడియో అది. కోహ్లీ అంటే తనకెంత ఇష్టమో.. అతడి నాయకత్వ లక్షణాలను పొగుడుతూ రొనాల్డో మాట్లాడారు. అది నాకెంతో నచ్చింది. వెంటనే దానిని షేర్ చేయాలనిపించి ఇన్‌స్టా వేదికగా అభిమానులతో పంచుకున్నా. కొంతసేపటికి అనుష్క శర్మ నుంచి నాకు మెసేజ్ వచ్చింది. అది రియల్ వీడియో కాదని.. ఫ్రాడ్ అని.. ఏఐతో దానిని సృష్టించారని ఆమె తెలిపింది. ఆ నిమిషం నాకు కాస్త ఇబ్బందిగా అనిపించింది. టెక్నాలజీ గురించి అవగాహన ఉన్న నేను కూడా ఏఐ వీడియోను గుర్తించలేకపోయాను. కాబట్టి టెక్నాలజీ వల్ల కూడా ఇలాంటి సమస్యలు తలెత్తుతాయని అర్థమైంది. సోషల్ మీడియాలో వచ్చే ఏదైనా సందేశాన్ని షేర్ చేయాలంటే అది నిజమేనా? కాదా? అని చెక్ చేసుకోవాల్సిన అవసరం ఉంది" అని మాధవన్ తెలిపారు. 'షైతాన్'తో గతేడాది ప్రేక్షకులను అలరించారు మాధవన్. ప్రస్తుతం ఆయన 'అదృష్టశాలి', 'టెస్ట్', 'దే దే ప్యార్ దే 2', 'కేసరి చాప్టర్ 2', 'ధురందర్' చిత్రాల్లో యాక్ట్ చేస్తున్నారు. వీటితోపాటు కంగనా రనౌత్‌తో కలిసి మరో సినిమా కోసం వర్క్ చేస్తున్నారు. ఆయా చిత్రాలు చిత్రీకరణ దశలో ఉన్నాయి. వరుస సినిమాలతో బిజీగా ఉండటంపై ఇటీవల ఆయన మాట్లాడారు. కెరీర్ విషయంలో తాను ఎంతో సంతోషంగా ఉన్నానని అన్నారు. నచ్చిన స్క్రిప్ట్‌లు ఎంచుకుంటూ ముందుకుసాగుతున్నానని అన్నారు. "ఇలాంటి పరిశ్రమలో 25 ఏళ్లు కొనసాగడం సులభం కాదు. కొందరు హీరోలు 25 నెలల్లోనే అవకాశాలు కోల్పోతారు. ఈ విషయంలో నేను అదృష్టవంతుడిని. నన్ను ఎంతోమంది ప్రేక్షకులు ఇప్పటికీ ఆదరిస్తున్నారు. వారందరికీ కృతజ్ఞతలు. వారి అభిమానమే నన్ను ఇంకా పరిశ్రమలో కొనసాగేలా చేస్తోంది. అది లేకపోతే నేను ఎప్పుడో కనుమరుగయ్యేవాడిని" అని చెప్పారు.

# నా జీవితంలో అసూయకు తావులేదు : సమంత



తన మాజీ భాగస్వామి కొత్త బంధంలోకి అడుగుపెట్టడంపై నటి సమంత మాట్లాడారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమెకు రిలేషన్‌షిప్ నుంచి బయటకు వచ్చి జీవితంలో ముందుకు సాగడంపై ప్రశ్న ఎదురైంది. దీనిపై స్పందిస్తూ.. "దాని నుంచి బయటకు వచ్చేందుకు ఎంతో శ్రమించాను" అని బదులిచ్చారు. అనంతరం విలేకరి.. "మాజీ భాగస్వామి కొత్త బంధంలోకి అడుగుపెట్టినందుకు మీరు ఏమైనా అసూయ పడుతున్నారా" అని ప్రశ్నించగా.. " నా జీవితంలో అసూయకు తావులేదు. నా జీవితంలో అది భాగం కావడాన్ని కూడా అంగీకరించను. అసూయే అన్ని చెడులకు మూలమని భావిస్తా" అని సమాధానం చెప్పారు. అలాంటి వాటి గురించి తాను పెద్దగా ఆలోచించనని అన్నారు. మాజీ భాగస్వామి గురించి సమంత మాట్లాడటం ఇదేమీ తొలిసారి కాదు. 'సిటడెల్: హనీ బన్నీ' ప్రమోషన్స్‌లోనూ ఆమె మాట్లాడారు. "అవసరం లేకపోయినా మీరు అత్యధిక మొత్తంలో దేని కోసం ఖర్చుపెట్టారు?" అని ఆ ప్రాజెక్ట్ కోస్టార్ వరుణ్ ధావన్ ప్రశ్నించగా "నా మాజీకి ఇచ్చిన ఖరీదైన కానుకలు" అని బదులిచ్చారు సమంత. "ఎంత ధర ఉంటుంది?" అని అడగ్గా "కాస్త ఎక్కువే.. ఇక కొనసాగిద్దాం" అంటూ ముగించారు. అయితే ఆ వ్యాఖ్యలు అప్పట్లో చర్చనీయాంశమయ్యాయి. అంతకుముందు కరణ్ జోహార్ షోలో మాట్లాడుతూ తను, మాజీ ఒకే గదిలో ఉంటే.. దగ్గరలో కత్తులు ఉండకపోవడం మంచిది అని అన్నారు. వర్క్ లైఫ్ విషయానికి వస్తే.. సమంత ఇటీవల 'సిటడెల్: హనీ బన్నీ' ప్రాజెక్టుతో అలరించారు. రాజ్ అండ్ డీకే దర్శకత్వంలో వచ్చిన ఈ ప్రాజెక్టులో వరుణ్ ధావన్, సమంత జంటగా నటించారు. 80-90ల కాలంలో సమాజంలో మహిళల పరిస్థితి ఏంటనేది అందులో చూపించారు. హనీ పాత్రలో సమంత మెప్పించారు. కుమార్తె నదియాను రక్షించుకొనే తల్లి పాత్రలో కన్పించారు. స్వీయ నిర్మాణంలో 'మా ఇంటి బంగారం' అనే సినిమాను కొన్ని నెలల క్రితం అనౌన్స్ చేశారు. దీంతోపాటు 'రక్త్ బ్రహ్మాండ్' అనే సిరీస్‌లోనూ నటిస్తోంది.

# సినిమా హిట్‌కు అదే ముఖ్యం : ఖుషీ కపూర్



దివంగత నటి శ్రీదేవి చిన్న కుమార్తెగా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చారు ఖుషీ కపూర్. ఆమె నటించిన తాజా చిత్రం 'లవ్‌యాపా'. ఫిబ్రవరి 7న ప్రేక్షకుల ముందుకురానుంది. దీని ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో తన గత చిత్రం నుంచి నేర్చుకున్న పాఠాలను ఖుషీ పంచుకున్నారు. థియేటర్‌లో సినిమా విడుదలవుతుంటే ఒత్తిడి సహజమేనన్నారు. "సినిమా హిట్ కావాలంటే దాన్ని ప్రేక్షకుల్లోకి తీసుకెళ్లడం ముఖ్యమని అర్థం చేసుకున్నా. మార్కెటింగ్ పరంగా చూసుకుంటే ఈ చిత్రం యూత్‌ను ఎక్కువ ఆకర్షిస్తుంది. ఈ సినిమాకు ఎలాంటి మార్పులు అవసరం లేదు. యువత ఈ సినిమాను ఆదరిస్తారని నేను కచ్చితంగా నమ్ముతున్నాను. 16 ఏళ్ల లోపు వారికీ 'లవ్‌యాపా' నచ్చుతుంది. అయినా ప్రతి సినిమా అందరికీ నచ్చేలా తీయలేం కదా. తొలి సినిమా (ది ఆర్చీస్ చిత్రాన్ని ఉద్దేశిస్తూ) కంటే ఇప్పుడు చాలానే నేర్చుకున్నాను. కథల ఎంపికలోనూ జాగ్రత్తలు తీసుకుంటున్నా" అని చెప్పారు. ఈ చిత్రబృందంతో తనకు ప్రత్యేక అనుబంధం ఏర్పడిందని వెల్లడించారు. 'లవ్‌యాపా' ఓటీటీలో కాకుండా థియేటర్‌లలో విడుదలవుతుందని.. ఈ విషయంలో కాస్త ఒత్తిడి ఉందని ఖుషీకపూర్ అంగీకరించారు. "ట్రైలర్ విడుదల సమయంలో ట్రైలర్, కొన్ని పాటలను బిగ్ స్క్రీన్‌పై చూసినప్పుడు నిజంగా వణికిపోయాను. మొదటిసారి నన్ను అలా చూసుకొని ఆనందించా. బాక్సాఫీస్ నంబర్లకు సంబంధించిన అంశం కాబట్టి సహజంగా ఒత్తిడి ఉంటుంది. ఇక, థియేటర్ విడుదలను పరిగణనలోకి తీసుకునేటప్పుడు ఇతర ఎన్నో అంశాలను కూడా పరిశీలించాల్సి ఉంటుంది. కలెక్షన్లు రావడానికి నావంతు కృషి చేస్తాను" అని ఖుషీ తెలిపారు. ప్రదీప్ రంగనాథన్ స్వీయ దర్శకత్వంలో తమిళంలో సూపర్‌హిట్ అందుకున్న చిత్రం 'లవ్ టుడే'. నేటితరం యువతీ యువకుల ప్రేమ కథతో దీనిని రూపొందించారు. ఇప్పుడిదే చిత్రానికి రీమేక్‌గా 'లవ్ యాపా' సిద్ధమైంది. అద్వైత్ చందన్ దర్శకత్వం వహించారు. ప్రదీప్ రంగనాథన్ నిర్మాతగా వ్యవహరించారు.

Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463